http://www.agnidharanews.com

# అగ్నిధార

నిజాల నిప్పు కణిక

శుక్రవారం 20 మార్చి 2026

ఎడిటర్: చేగొండ రవి కుమార్ యాదవ్

పేజీలు : 5 వెల : 5/-


Published from Peddapalli Ciculated by Hyderabad, , , Sangareddy, jagityala, Rangareddy, Khammam,Medchal Medak Siddipet, Nalgonda, , warangal, Nizamabad

## విలేకరులు కావలెను

ప్రజా గళాన్ని బలంగా వినిపిస్తూ.. అవినీతిపై సమరాన్ని సాగిస్తున్న అగ్నిధార తెలుగు దినపత్రికలో పనిచేయుటకు అనుభవం, ఆసక్తి గల వారికి అవకాశం కలదు. అన్ని జిల్లాలు, డివిజన్లు, మున్సిపల్ మరియు మండల కేంద్రాల్లో విలేకరులు కావలెను.

ఆసక్తి కలిగినవారు సంప్రదించగలరు


సెల్ : 80088 17828



## రోహిత్‌రెడ్డి ఫాంహౌస్ సీజ్?

- రెవెన్యూ అధికారులకు పోలీసులు లేఖ ఇచ్చే అవకాశం
- డ్రగ్స్ కేసులో బిగుస్తున్న ఉచ్చు
- మూడో రోజు సుదీర్ఘ విచారణ
- ఎంపీ పుట్టా మహేశ్ మినహా మిగిలిన ఏడుగురు విచారణకు హాజరు.. డ్రగ్స్ మూలాలపైనే పోలీసుల దృష్టి


## ఈసారి భారీగా రాష్ట్ర బడ్జెట్




- రూ.3.35 లక్షల కోట్లు?
- గత ఏడాది అంచనాల కంటే 10 శాతం పెరుగుదల!
- 2034 విజన్‌కు అనుగుణంగా ప్రతిపాదన
- స్థిరంగా పెరుగుతున్న పన్ను ఆదాయానికి తోడు ఇతర మార్గాలపై భరోసా
- కేంద్ర పన్నుల్లో వాటా, ప్రాయోజిత పథకాల ద్వారా నిధులు పెరుగుతాయని అంచనా
- నేడు అసెంబ్లీలో ప్రవేశపెట్టనున్న ప్రభుత్వం
- సంక్షేమానికే పెద్దపీట.. రూ.లక్ష కోట్లకు పైగానే కేటాయింపు
- విద్య, వైద్యం, వ్యవసాయానికీ ప్రాధాన్యం
- పాత పథకాల కొనసాగింపు.. ఆరు కొత్త పథకాలు!

హైదరాబాద్

ట్రిలియన్ డాలర్ల ఎకానమీ లక్ష్య సాధనలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ఈసారి భారీ బడ్జెట్ ప్రవేశపెట్టబోతోంది. 2026–27 ఆర్థిక సంవత్సరానికిగాను రూ.3.35 లక్షల కోట్ల వరకు అంచనాలతో ప్రతిపాదనలను శుక్రవారం అసెంబ్లీ ముందుంచనున్నట్టు తెలుస్తోంది. ఆరు గ్యారంటీల అమలుకు తోడు ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసే దిశలో వీటిని ఖరారు చేసినట్టు సమాచారం. స్థిరంగా పెరుగుతున్న పన్ను రాబడులను పరిగణనలోకి తీసుకోవడంతో పాటు కేంద్రం నుంచి ఆశించిన స్థాయిలో నిధులు సమకూరుతాయని - మిగతా3లో



## రైతు నామ సంవత్సరం

ఈ లక్ష్య సాధన కోసం మా పాలన కొనసాగుతుంది

శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది వేడుకలో సీఎం రేవంత్‌రెడ్డి

22న రైతు భరోసా నిధులు విడుదల చేస్తామని వెల్లడి

హైదరాబాద్

రాష్ట్రంలో వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చి రైతును రాజు చేయడమే లక్ష్యంగా తమ పాలన కొనసాగుతుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. శ్రీ పరాభవ నామ సంవత్సరాన్ని రైతు నామ సంవత్సరంగా మారుస్తామని వెల్లడించారు. గురువారం రవీంద్రభారతిలో శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది వేడుకలను ప్రభుత్వం ఘనంగా నిర్వహించింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు కొండా సురేఖ, జూపల్లి కృష్ణారావు, పొంగులేటి - మిగతా3లో

## ఇంధన వనరులపై దాడులా?



- తీవ్రంగా ఖండించిన భారత్
- చర్చలు, దౌత్యమే మార్గం: మోదీ
- యుద్ధ పరిణామాలపై ఆందోళన
- ఒమన్, జోర్డాన్, ఫ్రాన్స్, మలేసియా అధినేతలతో సంభాషణ

## యుద్ధ కేంద్రాలుగా గ్యాస్ క్షేత్రాలు..



- ప్రమాదకర మలుపు తిరిగిన పశ్చిమాసియా యుద్ధం
- గల్ఫ్ గ్యాస్ ఫీల్డ్‌లపై క్షిపణులతో విరుచుకుపడ్డ ఇరాన్
- ఖతార్‌లోని రాస్ లఫాన్ గ్యాస్ క్షేత్రం ధ్వంసం
- సౌదీ, యూఏఈలోని కేంద్రాలపైనా భారీ దాడులు
- అనేక చమురు రిఫైనరీల్లో ఆగిన ఇంధన ఉత్పత్తి
- హొర్ముజ్ జలసంధి సమీపంలో నౌకల పేల్చివేత
- 'పార్స్'పై ఇజ్రాయెల్ దాడికి ఇరాన్ ప్రతీకారం
- అవసరమైతే ఇరాన్‌పై సైనిక చర్య: సౌదీ ఆరేబియా
- ఇరాన్ వెంటనే మాపై దాడులు ఆపాలి: అరబ్ దేశాలు

## సాగరతీరంలో షార్క్‌ల వేట!

గుట్టుచప్పుడు కాకుండా ఎగుమతులు

మత్స్యకారుల రూపంలో వేటాడుతున్న దళారులు

విశాఖ నుంచి చెన్నైకు షార్క్ చేపల భాగాలు

అక్కడి నుంచి సింగపూర్, మలేసియాకు ఎగుమతులు

ఎగుమతులపై నిషేధాన్ని పట్టించుకోని దళారులు



విశాఖపట్నం

ఎగుమతులపై నిషేధం ఉన్నప్పటికీ, విశాఖ ఫిషింగ్ హార్బర్ సాక్షిగా అరుదైన షార్క్ భారీ అక్రమ రవాణా సాగుతోంది. అంతర్జాతీయంగా ఎంతో డిమాండ్ ఉన్న షార్క్ ఫిన్స్ (మొప్పలు) కోసం మత్స్యకారుల రూపంలో వేటగాళ్లు సాగర గర్భాన్ని జల్లెడ పడుతున్నారు. వీరి నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్న దళారులు వాటిని కోట్లాది రూపాయలకు విదేశాలకు తరలిస్తున్నారు. షార్క్‌ల అక్రమ రవాణా అరికట్టకపోతే ఇందులో పలు - మిగతా3లో




## నిరుద్యోగ యువతకు భరోసా

- 10,060 పోస్టులతో జాబ్ క్యాలెండర్ విడుదల చేసిన ప్రభుత్వం
- నాలుగు విడతల్లో 41 నోటిఫికేషన్లతో ఉద్యోగాల భర్తీ
- పాఠశాల విద్యలో అత్యధికంగా 3,004, హోంశాఖలో 2,778 పోస్టులు
- నైపుణ్యం పోర్టల్‌లో వివరాల నమోదుతో అభ్యర్థులకు ప్రకటనల సందేశాలు
- యువగళం పాదయాత్ర హామీని నెరవేర్చామన్న మంత్రి లోకేశ్

## ఏటా ఉగాదికి జాబ్ క్యాలెండర్

- 20 లక్షల ఉద్యోగాల కల్పన హామీ నెరవేరుస్తాం
- శ్రీపరాభవ నామ సంవత్సరంలో ప్రజలందరికీ మంచి జరగాలి
- తెలుగుజాతిని అగ్రస్థానంలో నిలిపేలా సంకల్పం తీసుకుందాం
- ఉగాది వేడుకల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు
- 38 మందికి కళారత్న, 112 మందికి ఉగాది పురస్కారాల ప్రదానం



అమరావతి

ఏటా ఉగాది రోజున జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడించారు. ఏపీపీఎస్సీ ద్వారా 10,060 ఉద్యోగాలు భర్తీచేసేందుకు ఈసారి జాబ్ క్యాలెండర్ విడుదల చేసినట్లు ఆయన ప్రకటించారు. మే 15 నుంచి అక్టోబరు వరకు వివిధ నోటిఫికేషన్ల ద్వారా ఉద్యోగాలు భర్తీచేస్తామని వివరించారు. 20 లక్షల ఉద్యోగాల కల్పన హామీ నెరవేరుస్తామని అన్నారు. ఉగాది పచ్చడి జీవితాలను ప్రతిబింబిస్తుందని, షడ్రుచుల తరహాలో జీవితంలోనూ కష్టసుఖాలు ఉంటాయని ఆయన అభిప్రాయపడ్డారు. 2047 నాటికి తెలుగుజాతిని అగ్రస్థానంలో నిలిపేలా సంకల్పం తీసుకుని ముందడుగు వేద్దామని ప్రజలకు పిలుపునిచ్చారు. విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో గురువారం నిర్వహించిన శ్రీపరాభవ నామ సంవత్సర - మిగతా3లో

# యుద్ధ కేంద్రాలుగా గ్యాస్ క్షేత్రాలు..



**న్యూఢిల్లీ:** పశ్చిమాసియా ఉద్రిక్తతలతో ఇప్పటికే ప్రపంచ దేశాల్లో ఇంధన సంక్షోభ భయాలు నెలకొన్న వేళ యుద్ధం ప్రమాదకర మలుపు తిరిగింది. గ్యాస్ క్షేత్రాలు యుద్ధ క్షేత్రాలుగా మారడం ఆందోళన కలిగిస్తున్నది. బుధవారం ఇరాన్‌లోని అత్యంత ప్రధానమైన పార్స్ గ్యాస్ క్షేత్రంపై ఇజ్రాయెల్ దాడి చేయడంతో ఇరాన్ ప్రతీకార దాడులకు దిగింది. గల్ఫ్ దేశాల్లోని గ్యాస్ క్షేత్రాలే లక్ష్యంగా గురువారం విరుచుకుపడింది. ఖతార్‌లోని ప్రపంచంలోనే అతిపెద్ద ఎల్ఎన్‌జీ ఫెసిలిటీ అయిన రాస్ లఫాన్‌పై క్షిపణుల వర్షం కురిపించింది. ఎర్ర సముద్రంలోని సౌదీ రిఫైనరీపైనా దాడి చేసింది. రెండు కువైటీ చమురు రిఫైనరీలను దగ్ధం చేసింది. తన ప్రధాన సహజ వాయువు క్షేత్రంపై ఇజ్రాయెల్ దాడికి ప్రతీకారంగా ఇరాన్ ఈ దాడులకు తెగబడింది. పశ్చిమాసియాలో యుద్ధం ప్రపంచ ఇంధన సంక్షోభ భయాలను పెంచడంతో బ్రెంట్ ముడి చమురు ధర బ్యారెల్ 114 డాలర్లకు చేరుకుంది. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌కు సమీపంలో ఓ నౌక తగలబడి పోగా ఖతార్‌కు సమీపంలో మరో నౌక ధ్వంసమైంది. హెర్ముజ్ జలసంధి గుండా నౌకల రవాణాపై ఆంక్షలు విధించిన ఇరాన్ అమెరికా రక్షణ బలగాలకు ఆశ్రయమిస్తున్న దేశాలపై దాడులు చేస్తామని ఇదివరకే హెచ్చరించింది. హెర్ముజ్ జలసంధి మార్గాన్ని నివారించడానికి ఎర్ర సముద్రం మీదుగా నౌకలను తరలించడానికి సౌదీ అరేబియా పెద్ద ఎత్తున చమురును పంపింగ్ చేస్తున్నది.

అయితే ఎర్ర సముద్రం రేవు నగరం యాన్బులోని ఎంఆర్ఈఎఫ్ రిఫైనరీపై ఇరాన్ డ్రోన్ దాడి జరపడంతో ఆ మార్గంలో భద్రత కూడా ప్రశ్నార్థకంగా మారింది. ఇరాన్ క్షిపణులు దాడి చేయడంతో మంటల్లో చిక్కుకున్న ప్రధాన ఎల్ఎన్‌జీ సదుపాయాన్ని అగ్నిమాపక శకటాలతో కాపాడినట్లు ప్రపంచ మార్కెట్లకు లిక్విఫైడ్ నేచురల్ గ్యాస్‌ను సరఫరా చేసే ఖతార్ తెలిపింది. గతంలో జరిగిన దాడుల తర్వాత అక్కడ ఉత్పత్తి నిలిచిపోయినప్పటికీ ప్రస్తుత దాడులు భారీ నష్టాన్ని చేకూర్చినట్లు ఖతార్ పేర్కొన్నది. ఇరాన్ యుద్ధం ముగిసినా ఖతార్ నుంచి ప్రపంచ మార్కెట్‌కు ఎల్ఎన్‌జీ సరఫరా ఇప్పట్లో జరిగే అవకాశం లేదు. కువైట్‌లోని మీనా అల్ అహ్మదీ రిఫైనరీపై కూడా ఇరాన్ డ్రోన్ జరిగింది. మంటలు చెలరేగినప్పటికీ ప్రాణనష్టం వాటిల్లలేదని కునా వార్తాసంస్థ తెలిపింది. పశ్చిమాసియాలోనే అతి పెద్ద రిఫైనరీలో ఒకటైన ఇందులో రోజుకు 7.30 లక్షల బ్యారెళ్ల పెట్రోలియం ఉత్పత్తి జరుగుతుంది. డ్రోన్ దాడి జరిగిన తర్వాత సమీపంలోని మీనా అబ్దుల్లా రిఫైనరీలో మంటలు చెలరేగాయని అధికారులు చెప్పారు. బుధవారం రాత్రి ఇరాన్ జరిపిన భీకర దాడుల కారణంగా హబ్షన్ గ్యాస్ సదుపాయం, బాబ్ క్షేత్రంలో కార్యకలాపాలను మూసివేయవలసి వచ్చిందని అబూ ధాబీ తెలిపింది. ఇంధన సదుపాయాలపై ఇరాన్ దాడులను గల్ఫ్ దేశాలు తీవ్రంగా ఖండించాయి.

**క్షిపణి అలర్ట్ సైరన్లు**

గల్ఫ్ దేశాలు, ఇజ్రాయెల్‌లో నిరవధికంగా క్షిపణి హెచ్చరిక సైరన్లు మార్మోగుతున్నాయి. ఇరానియన్ దాడులను ఖతార్, సౌదీ అరేబియా, యూఏఈ ఖండించాయి. తమ దేశంపై ఉన్న కొద్దిపాటి విశ్వాసం పూర్తిగా తుడిచిపెట్టుకుపోయిందని సౌదీ అరేబియాకు చెందిన ఓ దౌత్యవేత్త వ్యాఖ్యానించారు. అయితే ఇరాన్ మాత్రం వెనక్కు తగ్గడం లేదు. రియాద్, తూర్పు ప్రావిన్సులో ఆరు డ్రోన్లను సౌదీ అడ్డుకుంది. అయితే సమ్రీ రిఫైనరీపై ఇరాన్ జరిపిన దాడి భారీ నష్టాన్ని చేకూర్చినట్లు సౌదీ రక్షణ శాఖ తెలిపింది. ఇజ్రాయెల్‌లో అనేక ప్రాంతాలపై ఇరాన్ క్షిపణి దాడులు సాగిస్తుండగా లక్షలాది మంది ఇండ్లను వీడి సహాయక శిబిరాల్లో తలదాచుకున్నారు. అనేక భవనాలు ధ్వంసం కాగా ప్రాణనష్టం పెద్దగా లేదు. తన సౌత్ పార్స్ సహజ వాయువు క్షేత్రంపై ఇజ్రాయెల్ జరిపిన దాడికి ప్రతీకారంగా ఇరాన్ గల్ఫ్, అరబ్ దేశాలపై భీకర దాడులకు పాల్పడుతున్నది. ఇరాన్‌లో ఉత్పత్తి అయ్యే విద్యుచ్ఛక్తిలో 80 శాతం సహజ వాయువు ద్వారానే వస్తున్నట్లు పారిస్‌కు చెందిన అంతర్జాతీయ ఇంధన సంస్థ తెలిపింది. ఇజ్రాయెల్ జరిపిన దాడి నేరుగా ఇరాన్ విద్యుత్తు సరఫరాలపై ప్రభావం చూపుతున్నది. సౌత్ పార్స్‌పై దాడిని తీవ్రంగా ఖండించిన ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ నియంత్రణలేని పర్యవసానాలకు ఇది దారి తీస్తుందని హెచ్చరించారు.

**ఇరాన్ తక్షణం దాడులు ఆపాలి**

**12 అరబ్, ఇస్లామిక్ దేశాల సంయుక్త ప్రకటన**

తక్షణమే తమపై ఇరాన్ దాడులు ఆపాలని గల్ఫ్ దేశాలు గురువారం విజ్ఞప్తి చేశాయి. అంతర్జాతీయ చట్టాలను గౌరవించాలని 12 గల్ఫ్, ఇస్లామిక్ దేశాల విదేశాంగ మంత్రులు ఓ సంయుక్త ప్రకటనలో ఇరాన్‌ను కోరారు. కాగా, అవసరమని భావిస్తే ఇరాన్‌పై సైనిక చర్యలు తీసుకునే హక్కు తమకు ఉందని సౌదీ అరేబియా ప్రకటించింది. ఇజ్రాయెల్, అమెరికా తన భూభాగంపై చేసిన దాడులకు ప్రతీకారంగా ఇరాన్ గల్ఫ్ దేశాలపై దాడులు చేసింది. ఈ గల్ఫ్ దేశాల నుంచి తనపై దాడులకు పాల్పడితే దాన్ని అమెరికన్ భూభాగంగా తాను పరిగణిస్తానని ఇరాన్ ప్రకటించింది. కాగా, నివాస ప్రాంతాలు, చమురు సదుపాయాలు, ఉప్పు నీటిని మంచినీరుగా మార్చే ప్లాంట్లు, విమానాశ్రయాలు, నివాస భవనాలు, దౌత్య కార్యాలయాలతోసహా పౌర ప్రాంతాలపై ఇరాన్ దాడులు చేస్తున్నదని సంయుక్త ప్రకటనలో గల్ఫ్, ఇస్లామిక్ దేశాలు పేర్కొన్నాయి. అజర్‌బైజాన్, బహ్రెయిన్, ఈజిప్టు, జోర్డాన్, కువైట్, లెబనాన్, పాకిస్థాన్, ఖతార్, సౌదీ అరేబియా, సిరియా, తుర్కియే, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌కు చెందిన విదేశాంగ మంత్రులు ఈ సంయుక్త ప్రకటనపై సంతకాలు చేశారు. కాగా, మరో ప్రకటనలో సౌదీ అరేబియా ఇరాన్‌కు తీవ్ర హెచ్చరికలు జారీచేసింది. అరబ్, ఇస్లామిక్ దేశాల విదేశాంగ మంత్రుల సమావేశం తర్వాత సౌదీ విదేశాంగ మంత్రి ప్రిన్స్ ఫైజలల్ బిన్ ఫర్హాన్ ఓ ప్రకటన విడుదల చేస్తూ పలువురు దౌత్యవేత్తలు సమావేశమైన రోజున రియాద్‌పై ఇరాన్ దాడి యాదృచ్ఛికం కాదని చెప్పారు.

# ఇంధన వనరులపై దాడులా?



**న్యూఢిల్లీ:** పశ్చిమాసియాలో కీలక ఇంధన వనరులపై దాడులను భారత్ తీవ్రంగా ఖండించింది. "ప్రపంచమంతటినీ ఎంతగానో కలతకు గురి చేసే అంశమిది. ఇప్పటికే ఒడిదొడుకుల్లో ఉన్న అంతర్జాతీయ ఇంధన మార్కెట్‌ను ఈ దాడులు మరింతగా దెబ్బ తీస్తాయి"అంటూ ఆందోళన వెలిబుచ్చింది. ఇరాన్‌లోని సౌత్ పార్స్ చమురు క్షేత్రాలపై ఇజ్రాయెల్ దాడి, ప్రతీకారంగా ఖతర్‌లోని ఎల్ఎన్‌జీ క్షేత్రం రస్ లఫాన్‌తో పాటు సౌదీ అరేబియాలో అతి పెద్ద చమురు క్షేత్రమైన ఆరాంకోపైనా ఇరాన్ దాడులు కలకలం రేపడం తెలిసిందే. ఇవి భారత్‌ను తీవ్రంగా కలచివేసినట్టు విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైస్వాల్ తెలిపారు. పౌర సదుపాయాలు, ఇంధన వనరులపై దాడులు కూడదని భారత్ ముందునుంచీ చెబుతూనే వస్తోందని గుర్తు చేశారు. వాటికి తక్షణం తెర దించాలని గురువారం మీడియా సమావేశంలో ఆయన సూచించారు. భారత ఎల్ఎన్‌జీ దిగుమతుల్లో 40 శాతానికి పైగా ఖతర్ నుంచి వస్తుండటం తెలిసిందే.

**దాడులు గర్హనీయం: మోదీ**

పశ్చిమాసియా తాజా పరిణామా లపై ప్రధాని నరేంద్ర మోదీ తీవ్ర ఆందోళన వెలిబుచ్చా రు. ఈ విషయమై పలువురు దేశాధినేతలతో ఆయన వేర్వేరుగా సంభాషించారు. ఫ్రాన్స్ అధ్యక్షుడు ఎమ్మాన్యుయేల్ మాక్రాన్, ఒమన్ సుల్తాన్ హైతం బిన్ తారిఖ్, మలేసియా ప్రధాని అన్వర్ ఇబ్రహీం, జోర్డాన్ రాజు అబ్దుల్లా--2తో ఫోన్‌లో మాట్లాడారు. పశ్చిమాసియాలో తాజా పరిస్థితులను గురించి వారితో లోతుగా చర్చించారు. ఇంధన వ్యవస్థలపై దాడులు తీవ్రంగా గర్హనీయమన్నారు. ఉద్రిక్తతలకు తక్షణం తెర దించి శాంతి, సుస్థిరత పాదుగొల్పేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. హార్మూజ్ జలసంధి గుండా సురక్షిత నౌకాయాన్ని తక్షణం పునరుద్ధరించాల్సిన అవసరాన్ని నొక్కిచెప్పారు. వీటన్నింటికీ దౌత్యం, మధ్యవర్తిత్వమే మార్గాలని స్పష్టం చేశారు. ఆ దిశగా జరిగే ప్రయత్నాలకు భారత్ అన్నివిధాలా మద్దతుగా నిలుస్తుందని మోదీ స్పష్టం చేశారు. అధినేతలతో చర్చలు ఫలప్రదంగా సాగినట్టు ఎక్స్ పోస్టుల్లో ఆయన వెల్లడించారు. పశ్చిమాసియా విషయమై ఆందోళనలతో వారంతా ఏకీభవించినట్టు తెలిపారు. "అబ్దుల్లా--2, తారిఖ్‌తో చర్చల సందర్భంగా జోర్డాన్, ఒమన్ ప్రజలకు ఈద్ శుభాకాంక్షలు తెలిపా. ఇంధన వనరులపై దాడులను ఖండించా"అని తెలిపారు. గత ఫిబ్రవరి 28న ఇరాన్‌పై ఇజ్రాయెల్--అమెరికా యుద్ధం మొదలైనప్పటి నుంచి ఒమన్, జోర్డాన్ అధినేతలతో మోదీ సంభాషించడం ఇది రెండోసారి. పాక్ నైజమే అంత: భారత్‌న్యూఢిల్లీ: అణ్వాయుధాల వ్యాప్తికి, అధునాతన క్షిపణి వ్యవస్థల విస్తరణకు పాకిస్తాన్ గుట్టుచప్పుడు కాకుండా ప్రయత్నాలు కొనసాగిస్తూనే ఉందంటూ ఒక నివేదికలో అమెరికా నిఘా వర్గాలు వెలిబుచ్చిన ఆందోళనతో భారత్ ఏకీభవించింది. "ఇలాంటి వేషాలు పాక్‌కు కొత్త కాదు. ఆ దేశం నైజమే అంత" అంటూ విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణ్యదీర్ జైస్వాల్ గురువారం ఎద్దేవా చేశారు. "ప్రపంచానికి పాక్ ఎంత ప్రమాదకరమో అందరికీ తెలుసు. అమెరికా నివేదిక ఆ వాస్తవాన్ని మరోసారి అందరి ముందూ ఉంచంది" అని అభిప్రాయపడ్డారు.

# రస్ లఫాన్.. ఇండియాకు కీలకం

ఖతర్ పాలకుల దార్శనికతకు ప్రత్యక్ష రూపమే రస్ లఫాన్ సహజవాయు క్షేత్రం. వేల కోట్ల రూపాయల పెట్టుబడితో అత్యంత అధునాతన సాంకేతికతతో సృష్టించిన అతిపెద్ద సహజవాయు ప్రాసెసింగ్ కర్మాగారంగా 'రస్ లఫాన్ ఇండ్రస్టియల్ సిటీ' ప్రఖ్యాతిగాంచింది. ఖతార్, ఇరాన్ మధ్యలోని పర్షియన్ గల్ఫ్ సముద్రగర్భంలో సహజవాయు నిక్షేపాలను కనుగొనేందుకు 1996లో రస్ లఫాన్ ఇండ్రస్టియల్ సిటీని నిర్మించారు. వీళ్ల ప్రయత్నాలు ఎట్టకేలకు ఫలించాయి. 1970 దశకంలో అపార సహజవాయు నిక్షేపాలను ఇక్కడి సముద్రగర్భంలో కనుగొన్నారు. ఇరాన్‌తో కలిసి గ్యాస్‌క్షేత్రాన్ని అభివృద్ధిచేసి ఖతర్ తన వాటాగా నార్త్ ఫీల్డ్‌ను తీసుకుంది. దీనినే నార్త్ డోమ్ అని కూడా పిలుస్తారు. ప్రపంచ 20 శాతం ద్రవరూప సహజవాయు అవసరాలను రస్ లఫాన్ క్షేత్రమే తీరుస్తోంది. తమ ఆ్యదీనంలోని 900 ట్రిలియన్ల ఘనపు చదరపు అడుగుల (టీసీఎస్ఎఫ్) మేర సహజవాయువును రస్ లఫాన్ కాంప్లెక్స్ ద్వారా ఖతార్ ప్రాసెస్ చేసి విదేశాలకు ఎగుమతి చేస్తోంది. ఇక్కడే భారీ నౌకలను నిలిపేందుకు వీలుగా ప్రపంచంలోనే అతిపెద్ద కృత్రిమ నౌకాశ్రయాన్ని నిర్మించారు. దీంతో సీఎన్‌జీ కంటైనర్ షిప్‌లు నేరుగా ప్రాసెసింగ్ ప్లాంట్ల దాకా వచ్చి సరుకు నింపుకుని పయనమవుతాయి. ఇక్కడి నుంచి దజన్లకొద్దీ దేశాలకు ఎల్ఎన్‌జీ ఎగుమతి అవుతోంది. ఖతర్‌కు కాసుల వర్షం కురిపిస్తున్న ఈ నేచురల్ గ్యాస్ ఫీల్డ్ ప్రత్యక్షంగా భారత ద్రవరూప సహజవాయువు అవసరాలను తీరుస్తోంది. దోహా నగరానికి 80 కిలోమీటర్ల దూరంలోని ఈ పారిశ్రామిక నగరమే భారత 45 శాతం లిక్విడ్ నేచురల్ గ్యాస్ అవసరాలను తీరుస్తోంది. ఖతర్ ఆర్థికవ్యవస్థ పునాదులను పెకళించేందుకు ఇరాన్ చేస్తున్న ప్రయత్నాలు పరోక్షంగా భారత్‌కు కొత్త కష్టాలు తెచ్చిపెడుతున్నాయి.



**ఎరువులు, సీఎన్‌జీ, పీఎన్‌జీ అంతా ఇక్కడే..**

భారత్‌లో దాదాపు 45 శాతం ఎరువుల తయారీ, కంప్రెస్డ్ నేచురల్ గ్యాస్ (సీఎన్‌జీ), పైప్డ్ నేచురల్ గ్యాస్ (పీఎన్‌జీ) అవసరాలు తీరాలంటే రస్ లఫాన్ క్షేత్రం నుంచి ద్రవరూప సహజవాయువు రావాల్సిందే. భారత్‌లో 34 శాతం ఎరువుల తయారీతోపాటు వాహనాల్లో సీఎన్‌జీకి, గృహావసరాలు తీర్చే పీఎన్‌జీకి రస్ లఫాన్ నుంచి దిగుమతి చేసుకునే ద్రవరూప సహజవాయవునే ఉపయోగిస్తున్నారు. పరిశ్రమల్లో పెట్రోరసాయనాల తయారీకి సైతం ఇదే ఎల్ఎన్‌జీ అవసరం. కొంతమేర భారత విద్యుత్ అవసరాలనూ ఇదే గ్యాస్ తీరుస్తోంది. అమెరికా, ఆఫ్రికా దేశాల నుంచి పోలిస్తే భారత్ రస్ లఫాన్ క్షేత్రం నుంచి ఎల్ఎన్‌జీ దిగుమతి చేసుకోవడమే అత్యంత చవకైన వ్యవహారం. అందుకే భారత్ దీనిపైనే అధికంగా ఆధారపడుతోంది.

## హెర్ముజ్ దాటే నౌకలకు టోల్ ఫీజు..

## ఇరాన్ పార్లమెంట్‌లో బిల్లు



**న్యూఢిల్లీ :** హెర్ముజ్ జలసంధి గుండా ప్రయాణించే నౌకలపై టోల్ చార్జీలు వసూలు చేయాలన్న ప్రతిపాదనను ఇరాన్ పరిశీలిస్తున్నట్లు ఇరాన్ ప్రభుత్వంలో భాగస్వామి అయిన వ్యక్తి ఒకరు గురువారం వెల్లడించారు. ప్రపంచానికి సరఫరా అయ్యే చమురులో ఐదవ వంతు రవాణా జరిగే హెర్ముజ్ జలసంధిపై పూర్తి పట్టును ప్రదర్శిస్తున్న ఇరాన్ దీన్ని సొమ్ము చేసుకోవాలని యోచిస్తున్నది. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ యుద్ధం ప్రారంభించిన తర్వాత హెర్ముజ్ గుండా జరిగే నౌకల ప్రయాణాన్ని ఇరాన్ పూర్తిగా అడ్డుకుంది. నౌకాయానం, ఇంధన రవాణా, ఆహార సరఫరాల కోసం జలసంధి వాడుకుంటున్న దేశాలు ఇరాన్‌కు పన్నులు, టోల్ చార్జీలు చెల్లించాల్సి ఉంటుందన్న ప్రతిపాదిత బిల్లును పార్లమెంట్ పరిశీలిస్తున్నట్లు ఆ నాయకుడు చెప్పారు. ఇరాన్ సుప్రీం నాయకుడి సలహాదారు ఒకరు మాట్లాడుతూ యుద్ధం అంతిమంగా ముగిసిన తర్వాత హెర్ముజ్ జలసంధికి ఒక కొత్త పాలనా వ్యవస్థ ఏర్పడుతుందని, ఇది తమపై ఆంక్షలు విధించిన దేశాలపై సముద్రపరంగా పరిమితులను విధించడానికి ఇరాన్‌కు వీలు కల్పిస్తుందని తెలిపారు. ఫిబ్రవరి 28న యుద్ధం ప్రారంభమైన తర్వాత జలసంధి సమీపంలో కనీసం 20 వాణిజ్య నౌకలపై దాడులు జరిగాయి. చమురు ట్యాంకర్లపై డ్రోన్లు, క్షిపణులతో దాడులు జరిగాయి. ఈ ఘటనలతో జలసంధి గుండా ప్రయాణించడానికి అనేక నౌకలు వెనుకాడుతున్నాయి. వందలాది నౌకలు జలసంధి సమీపంలో నిలిచిపోవడం లేదా రూటు మార్చుకుని వెనుదిరగడం జరుగుతున్నది. యుద్ధం వల్ల 1,000కి పైగా నౌకలు అడ్డగింతకు గురైనట్లు అంచనా.

## కార్మిక వర్గానికి వ్యతిరేకం కాదు

**సుప్రీంకోర్టుకు తెలియజేసిన కేంద్ర ప్రభుత్వం**

**'ఇండస్ట్రీ'పదానికి విస్తృత అర్థంపై తీర్పు రిజర్వ్ చేసిన ధర్మాసనం**



**న్యూఢిల్లీ:** కార్మిక వర్గానికి తాము ఎంతమాత్రం వ్యతిరేకం కాదని కేంద్ర ప్రభుత్వం తేల్చిచెప్పింది. కార్మికుల ప్రయోజనాల పరిరక్షణ కోసం కృషి చేస్తున్నట్లు సుప్రీంకోర్టుకు తెలియజేసింది. వారి శ్రేయస్సుకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు పేర్కొంది. పరిశ్రమ(ఇండస్ట్రీ) అనే పదానికి విస్తృత అర్థం ఇవ్వడంపై సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం తమ తీర్పును రిజర్వ్ చేసింది. పారిశ్రామిక వివాదాల చట్టం--1947లోని ఇండస్ట్రీ అనే పదానికి అర్థం ఏమిటో చెప్పాలని కోరుతూ బెంగళూరు నీటి సరఫరా, మురుగునీటి పారుదల బోర్డు సుప్రీంకోర్టును ఆశ్రయించింది. దీనిపై 1978 ఫిబ్రవరి 21న అప్పటి ఏడుగురు సభ్యుల ధర్మాసనం చరిత్రాత్మక తీర్పు వెలువరించింది. ఆసుపత్రులు, విద్యా సంస్థలు, క్లబ్బులు, ప్రభుత్వ సంక్షేమ విభాగాలను కూడా 'ఇండస్ట్రీ'గా పరిణించాలని వెల్లడించింది. దీంతో ఆయా సంస్థల్లో పనిచేసే ఉద్యోగులు, కార్మికులు పారిశ్రామిక వివాదాల చట్టం--1947 పరిధిలోకి వచ్చారు. తద్వారా వారికి లబ్ధి చేకూరుతోంది. 1978 నాటి తీర్పు సరైనదేనా? అని ప్రశ్నిస్తూ కొందరు వ్యక్తులు సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. వీటిపై సుప్రీంకోర్టు ప్రస్తుత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని తొమ్మిది మంది సభ్యులు రాజ్యాంగ ధర్మాసనం తాజాగా విచారణ చేపట్టింది. మూడు రోజులుగా విచారణ కొనసాగిస్తోంది. గురువారం కేంద్ర ప్రభుత్వం తరఫున అటార్నీ జనరల్ ఆర్.వెంకటరమణి హాజరై వాదనలు వినిపించారు. అటవీ శాఖ ఇతర శాఖలను కూడా ఇండస్ట్రీగా ప్రకటించాలని కొందరు డిమాండ్ చేస్తున్నారని తెలిపారు. దీనివల్ల ప్రభుత్వ కార్యకలాపాలపై ప్రతికూల ప్రభావం పడుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక అంటూ వస్తున్న ఆరోపణల్లో నిజం లేదన్నారు. ధర్మాసనం స్పందిస్తూ.. తమ తీర్పును రిజర్వ్ చేస్తున్నట్లు ప్రకటించింది. ఈ తీర్పు కోసం పారిశ్రామిక వర్గాలు ఆసక్తిగా ఎదురు చూస్తున్నాయి.

## కేరళ సీఎం రేసులో లేను

**అసెంబ్లీ ఎన్నికల్లో నెగ్గిన ఎమ్మెల్యేనే ముఖ్యమంత్రి అవుతారు**

**నేను పోటీ చేయడంలేదు.. సీఎం అయ్యే ప్రసక్తే లేదు**

**కాంగ్రెస్ పార్టీ ఎంపీ శశి థరూర్ స్పషటకరణ**

**ఎన్నికల్లో యూడీఎఫ్ విజయం తథ్యమని ధీమా**

**న్యూఢిల్లీ:** కేరళలో అసెంబ్లీ ఎన్నికల సమరం మొదలయ్యింది. పార్టీలు గెలుపు వ్యూహాల్లో నిమగ్నమయ్యాయి. కాంగ్రెస్ నేతృత్వంలోని యునైటెడ్ డెమొక్రటిక్ ఫ్రంట్(యూడీఎఫ్), సీపీఎం నేతృత్వంలోని లెఫ్ట్ డెమొక్రటిక్ ఫ్రంట్(ఎల్‌డీఎఫ్) మధ్య ప్రధాన పోటీ సాగుతోంది. ఈ ఎన్నికల్లో యూడీఎఫ్ విజయం సాధిస్తే ముఖ్యమంత్రి ఎవరన్న దానిపై జోరుగా ఊహాగానాలు వినిపిస్తున్నాయి. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, తిరువనంతపురం ఎంపీ శశి థరూర్ పేరు తెరపైకి వచ్చింది. అయితే, ముఖ్యమంత్రి రేసులో తాను లేనని ఆయన తేలి?చచెప్పారు. అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయడం లేదని, అలాంటప్పుడు సీఎంగా ఎన్నికయ్యే అవకాశమే లేదని స్పష్టంచేశారు. ఎన్నికల్లో గెలిచిన ఎమ్మెల్యేల్లో ఒకరిని ముఖ్యమంత్రిగా ఎంపిక చేయడం సంప్రదాయంగా వస్తోందని వెల్లడించారు. అసెంబ్లీ ఎన్నికల్లో నెగ్గిన నాయకుడే సీఎంగా బాధ్యతలు చేపడితే బాగుంటుందని సూచించారు. శశి థరూర్ తాజాగా పీటీఐ వార్తా సంస్థకు ఇంటర్వ్యూ ఇచ్చారు. ఈ ఎన్నికల్లో అభ్యర్థిగా పోటీ చేయడం లేదు కాబట్టి ఏదో ఒక నియోజకవర్గంపైనే దృష్టి పెట్టాల్సిన అవసరం లేకుండాపోయిందన్నారు. కేరళ ఎన్నికల్లో తన పాత్ర మిక్స్‌డ్ బ్యాగ్ లాంటిదని చెప్పారు. రాష్ట్రమంతటా తిరుగుతూ తమ కూటమి అభ్యర్థుల గెలుపు కోసం ప్రచారం చేస్తానని సంకేతాలిచ్చారు. యూడీఎఫ్ విజయమే లక్ష్యంగా పని చేస్తానని ఉద్ఘాటించారు.

**ఎల్‌డీఎఫ్‌పై గూగ్లీలు విసురుతున్నాం**

రాష్ట్రంలో కూటమి నేతలంతా కలిసికట్టుగా పని చేయాలంటూ తమ నాయకుడు రాహుల్ గాంధీ ఇటీవల ఆదేశించారని శశి థరూర్ వివరించారు. క్షేత్రస్థాయిలో రాహుల్ ఆదేశాలను పాటిస్తున్నామని, సమన్వయంతో కలిసి పని చేస్తున్నామని పేర్కొన్నారు. కేరళ అసెంబ్లీలో మొత్తం 140 స్థానాలుండగా, ఎన్నికల్లో యూడీఎఫ్‌కు 85 నుంచి 100 స్థానాలు లభిస్తే చాలా సంతోషిస్తానని థరూర్ వ్యాఖ్యానించారు.

# ఈసారి భారీగా రాష్ట్ర బడ్జెట్

-మొదటిపేజీ తరువాయి

ప్రభుత్వం భావిస్తున్నట్టు ఆర్థిక శాఖ వర్గాలు వెల్లడించాయి. ఈ నేపథ్యంలోనే ఆరు గ్యారంటీలకు నిధులు కేటాయించడంతో పాటు కొత్తగా ఆరు పథకాలను ప్రతిపాదిస్తూ, 2034 నాటికి నిర్దేశించుకున్న విజన్‌కు అనుగుణంగా ప్రతిపాదనలు సిద్ధమైనట్లు తెలిపాయి. ఈసారి దూకుడు: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత మూడోసారి బడ్జెట్ ప్రవేశపెడుతోంది. అయితే గత రెండు బడ్జెట్‌లలోనూ ఆచితూచి వ్యవహరించిన ప్రభుత్వం.. అనేక అంచనాలు, ఆశలతో ఈసారి దూకుడుగా వెళ్లాలని నిర్ణయించినట్టు తెలుస్తోంది. 2024--25లో రూ.2.91 లక్షల కోట్ల బడ్జెట్‌ను ప్రతిపాదించగా, 2025--26లో 5 శాతం పెంచి రూ.3.05 లక్షల కోట్ల బడ్జెట్‌ను ప్రతిపాదించింది. అదే ఒరవడి కొనసాగితే 2026--27కు రూ.3.20 లక్షల కోట్ల వరకు ప్రతిపాదించే అవకాశముంది. కానీ ఏకంగా 10 శాతం పెంపుతో బడ్జెట్ ప్రతిపాదనలను సిద్ధం చేసినట్టు తెలుస్తోంది. సొంత పన్నుల ఆదాయంపై నమ్మకంతో పాటు కేంద్ర పన్నుల్లో వాటా, ప్రాయోజిత పథకాల ద్వారా నిధుల సమీకరణ పెరిగే అవకశాముందనే అంచనాలు, భూముల అమ్మకాలు, భూముల విలువల సవరణల ద్వారా మరిన్ని నిధులు సమకూరతాయనే ఆలోచనతో రూ.3.35 లక్షల కోట్ల వరకు ప్రతిపాదించే అవకాశాలున్నాయని తెలుస్తోంది.

**అప్పుల పద్దూ భారీగానే..!**

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో బహిరంగ మార్కెట్ ద్వారా రూ.64,539 కోట్లు సేకరించాలని నిర్ణయించగా, ఈసారి దాన్ని రూ.80 వేల కోట్ల వరకు ప్రతిపాదించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇక గత రెండు బడ్జెట్‌లలో భూముల అమ్మకాల ద్వారా నిధుల సమీకరణకు ప్రతిపాదనలు లేవు. కానీ ఈసారి అనివార్యమవుతోందని తెలుస్తోంది. అలాగే రాష్ట్రంలోని వ్యవసాయ, వ్యవసాయేతర భూములు, ఆస్తుల విలువల సవరణ ద్వారా రూ.3 వేల కోట్ల వరకు అదనంగా ఆదాయాన్ని సమకూర్చుకునే ప్రతిపాదన కూడా చేయనున్నట్టు సమాచారం.

**రూ.50 వేల కోట్ల మూలధన వ్యయ ప్రతిపాదనలు**

విద్య, వైద్యం, వ్యవసాయం, సాగునీటి ప్రాజెక్టులకు ప్రాధాన్యతనివ్వనున్నారు. అదే విధంగా మూలధన వ్యయాన్ని కూడా పెంచనున్నారు. 2025--26లో రూ.36 వేల కోట్ల మూల ధన వ్యయం అంచనా వేసినప్పటికీ ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి అది రూ.50 వేల కోట్లను చేరింది. ఈ నేపథ్యంలో ఈసారి ప్రతిపాదనలే రూ.50 వేల కోట్లకు చేరనున్నట్టు సమాచారం. 2025--26లో రూ.3.05 లక్షల కోట్ల బడ్జెట్‌కు గాను రూ.2.90 లక్షల కోట్ల వరకు సవరించిన అంచనాలుంటాయని భావిస్తూ ఈ మొత్తానికి మరో రూ.45 వేల కోట్లు కలిపి ఈసారి బడ్జెట్‌ను ప్రతిపాదించనున్నట్టు సమాచారం.

**అభిజిత్ లగ్నం..రేవతి నక్షత్రం**

విజయ ముహూర్తంలో బడ్జెట్ ప్రవేశపెట్టాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క నిర్ణయించారు. దీర్ఘకాలిక లక్ష్యాన్ని సాధించే దిశలో ఈసారి బడ్జెట్‌కు రూపకల్పన చేస్తున్న నేపథ్యంలో శుక్రవారం మధ్యాహ్నం 12 గంటలకు రేవతి నక్షత్ర అభిజిత్ లగ్నం సమయంలో అసెంబ్లీ ముందుంచనున్నారు. దీనికి ముందు ఉదయం ప్రజాభవన్‌లోని పోచమ్మ ఆలయంలో భట్టి దంపతులు ప్రత్యేక పూజలు చేస్తారు. ఆ తర్వాత అసెంబ్లీకి చేరుకోనున్న భట్టి.. మండలి చైర్మన్, అసెంబ్లీ స్పీకర్, సీఎంను మర్యాదపూర్వకంగా కలుస్తారు. 9:30 గంటలకు జరిగే కేబినెట్ సమావేశంలో బడ్జెట్‌కు ఆమోదం తీసుకున్న తర్వాత అసెంబ్లీలో ప్రవేశ పెడతారు. అదే సమయంలో శాసనమండలిలో నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి బడ్జెట్ ప్రతిపాదనలు సమర్పిస్తారు.

**పింఛన్లు, కల్యాణలక్ష్మి సాయం పెంపు**

ఈసారి బడ్జెట్‌లో ఎప్పటిలాగే సంక్షేమానికి పెద్దపీట వేసే అవకాశముందని తెలుస్తోంది. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం మొదలు యంగ్ ఇండియా స్కూల్స్ వరకు అన్నిటి బడ్జెట్ రూ.లక్ష కోట్లు దాటనుంది. వ్యవసాయానికి ఉచిత విద్యుత్, రైతు భరోసా, సన్న బియ్యానికి బోనస్, సన్న బియ్యం పంపిణీ, రూ.500కే గ్యాస్ సిలిండర్, రూ.200 యూనిట్ల వరకు ఉచిత గృహ విద్యుత్, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, చేయూత పింఛన్లు, కల్యాణలక్ష్మి, షాదీముబారక్, సంక్షేమ హాస్టళ్ల నిర్వహణ, ఫీజు రీయింబర్స్‌మెంట్ తదితర అన్ని పథకాలను కొనసాగించేందుకు అవసరమైన నిధులను ఈ బడ్జెట్‌లో ప్రతిపాదించనున్నారు. అదే సమయంలో చేయూత పింఛన్లు రూ.500 చొప్పున పెంపు, కల్యాణలక్ష్మికి రూ.50 వేల అదనపు లబ్ధి ప్రతిపాదనలు చేసే అవకాశాలున్నాయి. వీటికి తోడు మరో ఆరు కొత్త పథకాలను కూడా ప్రకటిస్తారని సమాచారం. రాష్ట్రంలోని దరఖాస్తు చేసుకున్న ప్రజలందరికీ రూ.5 లక్షల ప్రమాద బీమా సౌకర్యాన్ని ప్రకటిస్తారని, జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజనం, యంగ్ ఇండియా కిట్స్, పారా అథ్లెట్లకు ఇళ్ల స్థలాలు, వృద్ధ అర్చకులకు పింఛన్లకు తోడు ఎన్నికల హామీలో భాగంగా విద్యార్థినులకు ఈవీ స్కూటర్లు అందించే కార్యక్రమానికి కూడా నిధులు కేటాయించనున్నట్టు తెలుస్తోంది.

## ఏటా ఉగాదికి జాబ్ క్యాలెండర్



-మొదటిపేజీ తరువాయి

ఉగాది వేడుకల్లో సీఎం పాల్గొన్నారు. మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, కందుల దుర్గేష్, ఇతర ప్రజాప్రతినిధులతో కలిసి సీఎం పంచాగ్రశ్రవణం చేశారు. సంగీత, సాహిత్య, కళారంగాల్లో విశేషకృషి చేసిన 38 మందికి కళారత్న, 112 మందికి ఉగాది పురస్కారాలు సీఎం అందించారు. వ్యవసాయ, ఉద్యాన, తితిదే పంచాంగాలు, సాంస్కృతికశాఖ, శిల్పారామం వార్షిక కార్యక్రమాల క్యాలెండర్లను ముఖ్యమంత్రి ఆవిష్కరించారు.

**మన సంస్కృతికి విదేశాల్లో తెలుగువారే బ్రాండ్ అంబాసిడర్లు**

'మన పండగలు, ఆచారాల్లోనే సైన్స్ ఉంది. వాస్తు, సూర్య నమస్కారాలు ఇలాంటివే. యోగా, నేచురోపతి కూడా ప్రకృతి నుంచి వచ్చినవే. విలువలతో జీవనం గడిపేవారికి ఉన్న ఆనందం మరెవరికీ ఉండదు. మనకంటే విదేశాల్లోని ప్రవాసాంధ్రులు మన సంస్కృతీ సంప్రదాయాలు పాటించి బ్రాండ్ అంబాసిడర్లుగా మారారు. రాష్ట్రంలో ప్రతి వ్యక్తికీ ఆర్థిక, సామాజిక, ఆరోగ్యభద్రత అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యం. దివ్యాంగ శక్తి, స్త్రీశక్తి పథకాలతో దివ్యాంగులు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించడం ఎంతో ఆనందాన్ని కలిగించింది. సంపన్నులైన 10% మంది సమాజంలో అట్టడుగున ఉన్న 20% మందిని ఆదుకునేలా పీ4 కార్యక్రమాన్ని చేపట్టాం. గోదావరి పుష్కరాల కంటే ముందే పోలవరం ప్రాజెక్టు పూర్తిచేసి జాతికి అంకితమిస్తాం. దీనివల్ల కృష్ణా డెల్టాకు, విశాఖకు గ్రావిటీతో నీళ్లు వెళతాయి. తాగు, సాగునీటికి, పరిశ్రమలకు అవసరమైన నీటిని సరఫరా చేసేలా నీటి యాజమాన్య చర్యలు చేపడుతున్నాం. వేసవికి ముందే రాష్ట్రంలోని జలాశయాల్లో 65% మేర నీటి నిల్వలు ఉన్నాయి. 2024కు ముందు ఐదేళ్లు ఎవరూ సంతోషంగా పండగలు చేసుకునే పరిస్థితి లేదు. ఎక్కడ చూసినా భయం, విధ్వంసం, దారుణాలు జరిగాయి. ఇప్పటికీ కుట్రలు చేస్తున్న అలాంటి దుష్టుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. కార్యక్రమంలో ఉగాది పచ్చడి తింటున్న ముఖ్యమంత్రి చంద్రబాబు. చిత్రంలో ఎమ్మెల్యే బొండా ఉమ, మంత్రులు కందుల దుర్గేష్, ఆనం రామనారాయణరెడ్డి, ఎమ్మెల్యే రామ్మోహన్, సృజనాత్మకత, సంస్కృతి కమిషన్ ఛైర్‌పర్సన్ పొడపాటి తేజస్విని

**వినియోగదారులకు న్యాయం అందించడంలో అగ్రస్థానం**

వినియోగదారులకు న్యాయం అందించడంలో జాతీయస్థాయిలో ఏపీ అగ్రస్థానంలో నిలిచిందని ఒక నివేదిక వెల్లడించింది. యువతకు ఉద్యోగ కల్పనకు అత్యధిక ప్రాధాన్యమిస్తున్నాం. ఇప్పటివరకు 30,607 మందికి ప్రభుత్వోద్యోగాలు ఇచ్చాం. ప్రైవేటురంగంలో 6.28 లక్షల మందికి ఉద్యోగాలు కల్పించాం' అని సీఎం వివరించారు.

**జాబ్ ఫస్ట్ కూటమి ప్రభుత్వ విధానం**

జాబ్ ఫస్ట్ అనేది కూటమి ప్రభుత్వ విధానమని ముఖ్యమంత్రి చంద్రబాబు ఎక్స్‌లో పోస్ట్ చేశారు. దీనికి ఉగాది కానుకగా విడుదల చేసిన జాబ్ క్యాలెండర్‌ను జత చేశారు. "శ్రీపరాభవ నామ సంవత్సర ఉగాది సందర్భంగా వివిధ ప్రభుత్వశాఖల్లో 10,060 ఉద్యోగాలు భర్తీ చేయబోతున్నాం. మే 15 నుంచి అక్టోబరు 15 వరకు వీటి నోటిఫికేషన్లు విడుదల చేస్తాం. ఉద్యోగార్థులు సన్నద్ధత, ప్రతిభతో అవకాశాలను అందిపుచ్చుకోవాలని కోరుతున్నాను" అని అందులో పేర్కొన్నారు.

## రోహిత్‌రెడ్డి ఫాంహౌస్ సీజ్?

మొయినాబాద్ : ఫాంహౌస్‌లో డ్రగ్స్ పార్టీ కేసులో మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి చుట్టూ ఉచ్చు బిగుస్తోంది. డ్రగ్స్ పార్టీలో గన్ ఫైరింగ్ చేయడంతో ఇప్పటికే రోహిత్‌రెడ్డితో పాటు అతని తమ్ముడు రితీష్‌రెడ్డి, ఢిల్లీకి చెందిన నమిత్‌శర్మను పోలీసులు జైలుకు పంపారు. డ్రగ్స్ మూలాలపై దృష్టి పెట్టిన పోలీసులు ఫాంహౌస్ కేంద్రంగా ఏయే రకాల దందాలు కొనసాగుతున్నాయనే విషయాలను వెలికితీస్తున్నారు.మరో వైపు అసైన్డ్ భూమిలో ఉన్న రోహిత్‌రెడ్డి ఫాంహౌస్‌ను సీజ్ చేసేందుకు లేఖ రాస్తామని పోలీసులు ఇప్పటికే రెవెన్యూ అధికారులకు సమాచారం ఇచ్చారు. శుక్రవారం రెవెన్యూ అధికారులకు లేఖ అందే అవకాశం ఉంది. మొయినాబాద్ ఫాంహౌస్ డ్రగ్స్ పార్టీ కేసులో స్టేషన్ బెయిల్ పొందిన నిందితులను సిట్ అధికారులు మూడో రోజు సుదీర్ఘంగా విచారణ చేశారు. స్టేషన్ బెయిల్ పొందిన ఎనిమిది మందిలో ఏపీకి చెందిన ఎంపీ పుట్టా మహేశ్‌కుమార్ యాదవ్ మినహా మిగిలిన ఏడుగురు గురువారం మూడో రోజు విచారణకు హాజరయ్యారు. సిట్ అధికారులు ఉదయం 10 నుంచి రాత్రి 9 గంటల వరకు సుమారు 11 గంటల పాటు విచారించారు. డ్రగ్స్ సరఫరా ఎక్కడి నుంచి జరిగింది? ఎవరు సరఫరా చేశారు? రోహిత్‌రెడ్డి ఫాంహౌస్‌లో ఎంత కాలం నుంచి డ్రగ్స్ పార్టీలు జరుగుతున్నాయి? వీటికి ఎవరిని పిలిచారు? శనివారం జరిగిన డ్రగ్స్ పార్టీలో ప్రధానంగా ఏం చర్చించాలనుకున్నారు? అనే విషయాలను రాబట్టే ప్రయత్నం చేశారు. దేశంలోని వివిధ రాష్ట్రాలు, ??రపాంతాలకు చెందిన 11 మంది డ్రగ్స్ పార్టీలో పాల్గొన్నారంటే వీరి మధ్య ఎలాంటి బిజినెస్ డీల్ జరిగిందనే కోణంలో ఆరా తీశారు. ప్రధానంగా డ్రగ్స్ మూలాలపైనే సిట్ అధికారులు దృష్టి పెట్టారు. ఈ కేసులో రిమాండ్‌లో ఉన్న పైలెట్ రోహిత్‌రెడ్డి, రితేష్ రెడ్డి, నమిత్‌శర్మలను కస్టడీకి తీసుకుంటే అసలు విషయాలు బయటకొస్తాయని ఓ అధికారి తెలిపారు.

**ఫాంహౌస్ సీజ్ చేసే అవకాశం**

వివాదాలకు కేంద్ర బిందువుగా మారిన రోహిత్‌రెడ్డి ఫాంహౌస్‌ను రెవెన్యూ అధికారులు సీజ్ చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. మొయినాబాద్ మున్సిపాలిటీలోని అజీజ్‌నగర్ రెవెన్యూ సర్వేనంబర్ 177/33లో ఉన్న 3.39 ఎకరాల భూమిలో రోహిత్‌రెడ్డి ఫాంహౌస్ ఉంది. ఈ భూమిని ప్రభుత్వం అంతంగారి జంగయ్యకు అసైన్డ్ చేసింది. కొంత కాలం క్రితం రోహిత్‌రెడ్డి తన తండ్రి విఠల్‌రెడ్డి పేరుతో ఈ భూమిని కొనుగోలు చేశారు. అయితే రెవెన్యూ రికార్డులో ఇప్పటికీ అంతంగారి జంగయ్య పేరుతోనే కొనసాగుతోంది. రోహిత్‌రెడ్డి ఫాంహౌస్ నిర్మించి అందులో అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తున్నారని పోలీసులు భావిస్తున్నారు. ఎమ్మెల్యేల కొనుగోలు తోపాటు డ్రగ్స్ పార్టీ, గన్ ఫైరింగ్ వంటి వివాదాలకు ఈ ఫాంహౌస్ కేంద్ర బిందువుగా మారడంతో సీజ్ చేసే అవకాశం ఉన్నట్లు తెలిసింది. డ్రగ్స్ పార్టీ కేసులో ప్రధాన నిందితులు రోహిత్‌రెడ్డి, రితీశ్‌రెడ్డి, నమిత్‌శర్మను ఏడు రోజుల కస్టడీకి అనుమతించాలని పోలీసులు వేసిన కస్టడీ పిటీషన్‌పై రాజేంద్రనగర్ కోర్టు నేడు తీర్పు ఇవ్వనుంది. దీనిపై బుధవారం వాదనలు జరగడంతో తీర్పును శుక్రవారానికి రిజర్వు చేశారు. శుక్రవారం కోర్టు కస్టడీ పిటిషన్‌పై తీర్పు ఇవ్వనుంది. వారిని కస్టడీకి తీసుకుని విచారణ జరిపితే కీలక విషయాలు వెలుగుచూస్తాని పోలీసులు సైతం భావిస్తున్నారు.

# రైతు నామ సంవత్సరం

-మొదటిపేజీ తరువాయి

శ్రీనివాస్‌రెడ్డి, పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్, ఎంపీ వేం నరేందర్‌రెడ్డి, పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ల చైర్మన్లు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ రాష్ట్రంలో 70 శాతం కుటుంబాలు వ్యవసాయాధారితంగానే మనుగడ సాగిస్తున్నాయని చెప్పారు. ఈ దృష్ట్యా వ్యవసాయరంగ సంక్షేమం కోసం చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. రూ. 2 లక్షల రుణమాఫీతో రైతులను రుణ విముక్తులను చేశామని.. రూ. 18 వేల కోట్లను రైతు భరోసా కోసం ఖర్చు చేశామని వివరించారు.

ఈ నెల 22న మరో విడత రైతు భరోసా నిధులు విడుదల చేస్తున్నామని ప్రకటించారు. గతంలో రైతులను వేధించిన ధరణి భూతాన్ని పారదోలి భూభారతితో భూ సమస్యలు పరిష్కరించామని గుర్తుచేశారు. ప్రకృతి వైపరీత్యాల విషయంలో ప్రభుత్వం నిరంతరం అప్రమత్తంగా ఉంటోందని సీఎం చెప్పారు. ఈ సందర్భంగా ఆయన ఉగాది కొత్త పంచాంగాన్ని ఆవిష్కరించారు. అంతకుముందు పండితులు వేదాశీర్వాదం అందించారు. అనంతరం వేద పండితులు, ఆలయాల్లో సేవలందిస్తున్న కళాకారులను సన్మానించారు.

**ఈసారి మంచి వర్షాలే..**

పరాభవ నామ సంవత్సరంలో నైరుతి రుతుపవనాలు చురుగ్గా



ఉండి మంచి వానలు కురుస్తాయని.. ఫలితంగా తెలంగాణ వ్యవసాయ తల్లిగా ధాన్యాగారంగా మారుతుందని పౌరాణికులు, శృంగేరి ఆస్థాన పండితులు బాచంపల్లి సంతోషకుమార్ శాస్త్రి పేర్కొన్నారు. శ్రీ పరాభవ ఉగాది వేడుకల్లో ఆయన ప్రభుత్వపక్షాన పరాభవ నామ పంచాంగాన్ని చదివి గోచార వివరాలు వెల్లడించారు. తెలంగాణ ఆరోగ్య శాఖలో అద్భుత ప్రక్షాళన జరుగుతుందని.. ప్రజారోగ్యానికి సంబంధించిన చర్యలు, మెరుగైన వైద్య వసతి కల్పించడంలో సానుకూలత ఉంటుందన్నారు. గ్రామీణాభివృద్ధి, వ్యవసాయ శాఖల పరంగా ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందని తెలిపారు. ప్రభుత్వం కఠిన నిర్ణయాలు అవలంభించకుంటే ఈ సంవత్సరం ఆర్థిక ఒడిదొడుకులు తప్పవన్నారు. ఒప్పందాలు, భాగస్వామ్యం, ఇతర రాష్ట్రాలతో నీటి పంపకాల లాంటి వ్యవహారాల్లో జాగ్రత్తగా వ్యవహరించాల్సి ఉంటుందని.. రాష్ట్రానికి ఖర్చులు బాగా పెరుగుతాయని పేర్కొన్నారు. పరిపాలనలో రాజుకు, మంత్రులకు మధ్య ఆధిపత్యాలను కోరుకొనే వారి సంఖ్య ఎక్కువగా ఉంటుందని చెప్పారు.

అయితే ధర్మంగా ఉండేవారికి మాత్రం ఈ ఆధిపత్యంలోనూ విజయం లభిస్తుందని వివరించారు. తులారాశిలో ఉన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఈ సంవత్సరం సానుకూల పరిస్థితులే ఉన్నాయని.. నడుస్తున్న దశా బలం, గోచార బలం, సమర్థత, వబలం వల్ల సవాళ్లను అధిగమించి తిరుగులేని ఆధిపత్యం సాధించే అవకాశం ఉందని సంతోషకుమార్ శాస్త్రి చెప్పారు.

# నిరుద్యోగ యువతకు భరోసా

**అమరావతి:** ఉగాది రోజున నిరుద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం తీపికబురు అందించింది. 10,060 పోస్టులతో జాబ్ క్యాలెండర్‌ను విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ ఎక్స్‌లో విడుదల చేశారు. క్యాలెండర్ విడుదల చేయడమే కాకుండా పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ తేదీలను ముందే ప్రకటించారు. గతంలో క్యాలెండర్ మాత్రమే ఇస్తుండగా.. ఈసారి నోటిఫికేషన్ల తేదీలనూ ఇచ్చారు. నాలుగు విడతల్లో అన్ని పోస్టుల భర్తీకి 41 నోటిఫికేషన్లు విడుదల చేయనున్నారు. డీఎస్సీ, పోలీసు నియామకాలు మినహా అన్నింటినీ ఏపీపీఎస్సీ ద్వారానే భర్తీ చేయనున్నారు. విశ్వవిద్యాలయాల్లో 1,500 అసోసియేట్, సహాయ ఆచార్యుల పోస్టుల నోటిఫికేషన్‌తో నియామక ప్రక్రియ ప్రారంభం కానుంది. మే 15న ఈ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేస్తారు. సహాయ ఆచార్యుల పోస్టులకు 2018లో నిర్వహించినట్లే ఏపీపీఎస్సీ ద్వారా స్క్రీనింగ్ పరీక్ష నిర్వహిస్తారు. అత్యధికంగా పాఠశాల విద్యలో 3,004 ఉద్యోగాలు భర్తీ చేయనుండగా.. తర్వాత హోంశాఖలో 2,778 పోస్టులు ఉన్నాయి.

**డీఎస్సీలో 2,535 పోస్టులు**

2,535 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ అక్టోబరు 15న విడుదల చేయనున్నారు. ప్రతి ఏటా డీఎస్సీ ఇస్తామని ఇప్పటికే మంత్రి లోకేశ్ ప్రకటించారు. దీంతో ఖాళీలు, పదవీవిరమణతో వచ్చేవాటిని కలిపి నాలుగేళ్లకు విభజించి పోస్టులను ప్రకటించారు. ఈసారి డీఎస్సీలో ప్రత్యేక ఉపాధ్యాయ, ఎస్జీటీ, స్కూల్ అసిస్టెంట్ పోస్టులతో పాటు మ్యూజిక్, క్రాఫ్ట్, ఆర్ట్, డ్యాన్స్ టీచర్ ఖాళీలనూ భర్తీచేస్తారు.

**పాదయాత్ర హామీ నెరవేరింది: మంత్రి లోకేశ్**

యువగళం పాదయాత్రలో జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని తాను ఇచ్చిన హామీని ప్రజా ప్రభుత్వం నెరవేర్చడంతో చాలా సంతోషంగా ఉందని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ ఎక్స్‌లో తెలిపారు. "ఏపీ యువతకు ఉగాది కానుకగా ఉద్యోగాల పండగ ప్రకటిస్తున్నాం. వివిధ ప్రభుత్వశాఖల్లో 10,060 ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్లు ఏ తేదీన వస్తాయో.. ఎన్ని ఉద్యోగాలు భర్తీచేస్తామో ప్రకటిస్తూ జాబ్ క్యాలెండర్ విడుదల చేశాం. సిలబస్ సైతం ముందుగానే ప్రకటిస్తాం. ఇకనుంచి ప్రతి ఏటా ఉగాదికి ఉద్యోగాల ప్రకటన పండగ ఉంటుంది. నా మాట నేను నిలబెట్టుకున్నాను. ప్రజాప్రభుత్వం జాబ్ క్యాలెండర్ విడుదల చేసింది. అభ్యర్థులు పోటీ పరీక్షలకు సిద్ధమవ్వాలి. ఉద్యోగార్థులందరికీ ఉగాది శుభాకాంక్షలు" అని తెలిపారు.

**నైపుణ్యం పోర్టల్‌తో సమాచారం**

నిరుద్యోగ అభ్యర్థుల విద్యార్హతలకు సరిపోయే ఉద్యోగ ప్రకటనలు వస్తే వెంటనే వారికి సంక్షిప్త సమాచారం వెళ్లేలా నైపుణ్యం పోర్టల్‌ను తీర్చిదిద్దారు. అభ్యర్థులు ఝశ్రీవఅఝుతీ పోర్టల్ ద్వారా వివరాలు నమోదుచేస్తే జాబ్ క్యాలెండర్‌లోని ఉద్యోగాల ప్రకటనలతో పాటు భవిష్యత్తులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగాల నోటిఫికేషన్ల సమాచారం సైతం అభ్యర్థులకు వస్తుంది. ఆధార్ నంబరు నమోదు చేసి, సెల్‌ఫోన్‌కు వచ్చే ఓటీపీ ద్వారా ఈ పోర్టల్‌లో లాగిన్ అయ్యి, వివరాలు నమోదుచేయాలి. ఈ పోర్టల్‌ను నియామకాల పోర్టళ్లతో అనుసంధానం చేయనున్నారు.

# సాగరతీరంలో షార్క్‌ల వేట!

-మొదటిపేజీ తరువాయి

జాతులు అంతరించే ప్రమాదం ఉందని పర్యావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు. భారత ప్రభుత్వం షార్క్‌ల వేటను 'టైగర్' వేటతో సమానంగా పరిగణిస్తున్నా, విశాఖ తీరంలో మాత్రం చట్టం చుట్టంగా మారుతోందనే విమర్శలు వస్తున్నాయి. భారత ప్రభుత్వం వన్యప్రాణుల సంరక్షణ చట్టం (1972) ప్రకారం షార్క్‌ల వేటను, ఎగుమతిని కఠినతరం చేసింది. ముఖ్యంగా 2001లో షార్క్‌లలోని కొన్ని అరుదైన జాతులను షెడ్యూల్--1 జాబితాలో చేర్చడం ద్వారా వీటి వేటను పూర్తిగా నిషేధించింది.

**మత్స్యకారులకు బెదిరింపులు**

విశాఖ హార్బర్‌లో వేటకు వెళ్లే మత్స్యకారుల అమాయకత్వాన్ని కూడా దళారులు పెట్టుబడిగా మార్చుకుంటున్నారు. పొరపాటున వలకు చిక్కిన షార్క్‌లను చూపి 'వీటిని విక్రయించడం నేరం, పోలీసులు పట్టుకుంటే జైలుకు వెళ్లాల్సి వస్తుంది' అని భయపెడుతున్నట్లు తెలుస్తోంది. ఆ భయంలో మత్స్యకారులు వాటిని వదిలించుకోవాలని చూసినప్పుడు, దళారులు అతి త క్కువ ధర చెల్లించి వాటిని కొనుగోలు చేస్తారని సమాచారం. మరికొంతమంది దళారులు ఏకంగా మత్స్యకారుల అవతారమెత్తి.. షార్క్‌ల వేట చేస్తున్నారనే విమర్శలున్నాయి. బయట మార్కెట్లో లక్షల విలువ చేసే షార్క్‌ల విడిభాగాలు, మత్స్యకారుల చేతుల్లో కేవలం కొన్ని వందల రూపాయిలకే దళారుల పరమవుతున్నాయి.

**అక్రమ రవాణా మార్గం**

విశాఖ హార్బర్‌లో దొరికిన షార్క్‌లను హార్బర్‌లోనే రహస్య ప్రాంతాలకు తరలిస్తారని తెలుస్తోంది. అక్కడ నిపుణులైన వ్యక్తులతో ఫిన్స్, కాలేయాన్ని, ఇతర భాగాలను వేరు చేస్తారు. వీటిని ఐస్ బాక్సుల్లో భద్రపరిచి, రవాణా వాహనాల్లో చేపల లోడ్ మధ్యలో దాచి పెడుతున్నట్లు సమాచారం. స్మగ్లర్లు మల్టీలేయర్ రవాణా పద్ధతిలో చిన్న చిన్న ఐస్ బాక్సుల్లో దాచి.. ప్రైవేట్ బస్సుల ద్వారా చెన్నైకి తరలిస్తున్నట్లు తెలుస్తోంది. విశాఖ నుంచి ఇవి నేరుగా చెన్నైకి చేరుతాయి. అక్కడి నుంచి సముద్ర మార్గం లేదా విమానాల ద్వారా చైనా, థాయ్‌లాండ్, సింగపూర్, మలేషియా, హాంగ్‌కాంగ్ తదితర దేశాలకు అక్రమంగా ఎగుమతి అవుతున్నాయని నిఘా వర్గాల సమాచారం.

**అధికారుల నిర్లక్ష్యం**

ఈ అక్రమ రవాణా అంతా మత్స్యశాఖ అధికారుల కళ్లముందే జరుగుతున్నా, వారు కనీసం తనిఖీలు చేయడం లేదన్న విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. కొందరు కింది స్థాయి సిబ్బందికి దళారులతో చీకటి ఒప్పందాలు ఉన్నాయనీ.. అందుకే అక్రమ రవాణా వాహనాలు యథేచ్ఛగా వెళ్తున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఫిర్యాదులు చేసినా 'సాంకేతిక కారణాలు' సాకుతో కాలయాపన చేస్తున్నారే తప్ప, గట్టి నిఘా పెట్టిన దాఖలాలు లేమునే ఆరోపణలున్నాయి. కేవలం విశాఖలోనే కాకుండా దేశవ్యాప్తంగా.. అనేక సముద్ర తీర ప్రాంతాల్లో షార్క్‌ల వేట సాగుతోంది. వరల్డ్‌వైడ్ ఫండ్--ఇండియా (డబ్ల్యుడబ్ల్యుఎఫ్--ఐ), ట్రాఫిక్ సంస్థల నిమేదిక ప్రకారం.. భారత దేశ వ్యాప్తంగా గడిచిన దశాబ్ద కాలంలో 18,000 కిలోల షార్క్ ఫిన్స్‌ని దళారుల నుంచి స్వాధీనం చేసుకున్నారు.

## సంపాదకీయం

# 5 రాష్ట్రాల్లో గెలుపు ఎవరిది

దేశంలో ఎన్నికల సందడి మొదలైంది. కీలకమైన నాలుగు రాష్ట్రాలు మరియు ఒక కేంద్రపాలిత ప్రాంతంలో అసెంబ్లీ ఎన్నికల నగారా మోగింది. తమిళనాడు, పశ్చిమ బెంగాల్, కేరళ, అస్సాం రాష్ట్రాలతో పాటు పుదుచ్చేరిలో అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం అధికారికంగా షెడ్యూల్‌ను ప్రకటించింది. ఈ ఐదు ప్రాంతాల్లో కలిపి మొత్తం 824 అసెంబ్లీ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. ఐదు రాష్ట్రాల ఎన్నికలకు నోటిఫికేషన్ వచ్చేసింది. ఈ ఐదురాష్ట్రాల ఎన్నికల్లో అస్సాంలో మాత్రమే కాంగ్రెస్, బీజేపీ ముఖాముఖి పోటీ పడుతున్నాయి. బెంగాల్ లో బీజేపీ టీఎంసీ, కేరళలో కాంగ్రెస్ , లెఫ్ట్ కూటములు.. తమిళనాడులో త్రిముఖ పోటీ ఉంది. కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకటించడంతో పశ్చిమ బెంగాల్, తమిళనాడు, కేరళ, అస్సాం , పుదుచ్చేరిలలో రాజకీయ సందడి పతాక స్థాయికి చేరింది. ఈ ఎన్నికలు కేవలం స్థానిక ప్రభుత్వాల మార్పుకే పరిమితం కాకుండా, కేంద్ర రాజకీయాల్లోనూ మార్పులు తీసుకురానున్నాయి. ముఖ్యంగా ప్రాంతీయ పార్టీల ఆధిపత్యం ఉన్న రాష్ట్రాల్లో జాతీయ పార్టీలు ఏ మేరకు పాగా వేస్తాయన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. పశ్చిమ బెంగాల్ పోరు మళ్ళీ దీదీ వర్సెస్ మోదీ గా మారింది. మమతా బెనర్జీ నేతృత్వంలోని తృణమూల్ కాంగ్రెస్ తన పదేళ్ల సంక్షేమ పథకాలు ,బెంగాలీ అస్మితను నమ్ముకోగా, బీజేపీ అవినీతి , ప్రజల అసంతృప్తిని ప్రధాన అస్త్రాలుగా చేసుకుని బరిలోకి దిగుతోంది. గత ఎన్నికల కంటే ఈసారి బీజేపీ మరింత వ్యూహాత్మకంగా అడుగులు వేస్తుండటంతో, బెంగాల్ గడ్డపై హోరాహోరీ పోరు తప్పేలా లేదు. ఇక్కడ చిన్నపాటి ఓట్ల చీలిక కూడా ఫలితాలను తలకిందులు చేసే అవకాశం ఉంది. దక్షిణాది రాష్ట్రమైన తమిళనాడులో రాజకీయ సమీకరణాలు పూర్తిగా మారిపోయాయి. అధికార డీఎంకే కూటమి పటిష్టంగా ఉన్నట్లు కనిపిస్తున్నప్పటికీ, సూపర్ స్టార్ విజయ్ రాజకీయ ప్రవేశం తమిళగ వెట్రి కజగం రూపంలో కొత్త సవాలును విసిరింది. అన్నాడీఎంకే తన ఉనికిని కాపాడుకునే ప్రయత్నంలో ఉండగా, విజయ్ రాకతో ఇక్కడ ముక్కోణపు పోటీ నెలకొంది. విజయ్ వైపు మళ్లుతున్న యువత ఓట్లు ఎవరి గెలుపును అడ్డుకుంటాయో అన్నది ఇప్పుడు మిలియన్ డాలర్ల ప్రశ్న. పుదుచ్చేరిలో కూడా ఇదే విధమైన కూటముల పోరు సాగుతోంది. డీఎంకే కూటమిలో కాంగ్రెస్, అన్నాడీఎంకే కూటమిలో బీజేపీ ఉన్నాయి. సాధారణంగా కేరళలో ఐదేళ్లకోసారి ప్రభుత్వం మారుతుంటుంది, కానీ గత ఎన్నికల్లో పినరయి విజయన్ ఆ సంప్రదాయాన్ని చెరిపివేశారు. ఎల్.డి.ఎఫ్ వరుసగా మూడోసారి అధికారంలోకి వచ్చి హ్యాట్రిక్ సాధించాలని చూస్తోంది. మరోవైపు కాంగ్రెస్ నేతృత్వంలోని యుడిఎఫ్ ఈసారి ఎలాగైనా అధికారం దక్కించుకోవాలని పట్టుదలతో ఉంది. బిజెపి ఇక్కడ బలమైన మూడో శక్తిగా ఎదగడానికి ప్రయత్నిస్తోంది. త్రిముఖ పోటీ జరిగే కొన్ని నియోజకవర్గాల్లో బిజెపి ఓట్లు ఎవరిని ముంచుతాయో అన్నది కీలకం. అస్సాంలో ప్రధాన పోటీ బిజెపి , కాంగ్రెస్ మధ్యే ఉంది. ముఖ్యమంత్రి హిమంత బిస్వ శర్మ సారథ్యంలో బిజెపి ధీమాగా ఉంది. మహాజోత్ కూటమి విచ్ఛిన్నం కావడం బిజెపికి కలిసి వచ్చే అంశం. కాంగ్రెస్ నాయకుడు గౌరవ్ గొగోయ్ తన వ్యక్తిగత చరిష్మాతో బిజెపికి గట్టి పోటీ ఇస్తున్నారు. అయితే, అభివృద్ధి మంత్రం , హిందూత్వ కార్డుతో బిజెపి పైచేయి సాధించే అవకాశాలు ఉన్నాయని ప్రాథమిక అంచనాలు చెబుతున్నాయి. ప్రతి రాష్ట్రంలోనూ స్థానిక సమస్యలతో పాటు జాతీయ అంశాలు కూడా ఓటర్లపై ప్రభావం చూపుతున్నాయి. ఈ ఎన్నికల ఫలితాలు అటు అధికార పక్షానికి, ఇటు విపక్ష కూటమికి అత్యంత ప్రతిష్టాత్మకం కానున్నాయి. ఈ ఐదు రాష్ట్రాల తీర్పు భారత రాజకీయ ముఖచిత్రాన్ని మార్చే అవకాశం ఉంది. పశ్చిమ బెంగాల్, తమిళనాడులలో ప్రాంతీయ పార్టీల పట్టు నిలుస్తుందా? లేదా జాతీయ పార్టీలు తమ ప్రభావం చూపిస్తాయా? అన్నది మే నెలలో తేలనుంది. తమిళనాడు, బెంగాల్, కేరళ, అస్సాం , పుదుచ్చేరి శాసనసభల పదవీకాలం మే, జూన్ నెలల్లో ముగియనుంది. దీనిని దృష్టిలో ఉంచుకుని, ఈసీ ఇప్పటికే ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను పూర్తి చేసింది. క్షేత్రస్థాయి పరిస్థితులను సమీక్షించిన తర్వాతే ఈ నిర్ణయం తీసుకున్నట్లు కమిషన్ స్పష్టం చేసింది. అసెంబ్లీ ఎన్నికలతో పాటు ఆరు రాష్ట్రాల్లోని ఎనిమిది స్థానాలకు ఉప ఎన్నికలు కూడా జరగనున్నాయి. సిట్టింగ్ ఎమ్మెల్యేల మరణంతో అనివార్యమైన ఈ ఉప ఎన్నికల వివరాలు:పశ్చిమ బెంగాల్‌లో వరుసగా అధికారంలో ఉన్న మమతా బెనర్జీకి ఈసారి వ్యతిరేక పవనాలు బలంగా ఉన్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు. బీజేపీ బలమైన ప్రతిపక్షంగా అవతరించడం, క్షేత్రస్థాయిలో సంస్థాగత మార్పులు మమతా బెనర్జీకి పెద్ద సవాలుగా మారాయి. అవినీతి ఆరోపణలు, నిరుద్యోగ సమస్యలు మరియు శాంతిభద్రతల విషయంలో ప్రభుత్వంపై వస్తున్న విమర్శలు దీదీకి మైనస్ పాయింట్లుగా మారుతున్నాయి. ప్రజలు మార్పును కోరుకుంటున్నారా? లేక సంక్షేమ పథకాలతో మమత మరోసారి అధికారాన్ని నిలబెట్టుకుంటారా? అన్నది వేచి చూడాలి. తమిళనాడులో డీఎంకే ప్రభుత్వంపై ప్రజల స్పందన మిశ్రమంగా కనిపిస్తోంది. ధరల పెరుగుదల, మౌలిక సదుపాయాల కొరత, మరియు కొన్ని ప్రజా వ్యతిరేక విధానాలు స్టాలిన్ సర్కార్‌కు ఇబ్బందిగా మారాయి. తమిళనాడు రాజకీయాల్లో వస్తున్న కొత్త మార్పులు, మిత్రపక్షాల ఒత్తిడి మరియు బీజేపీ వంటి జాతీయ పార్టీల విస్తరణ స్టాలిన్ ఓటు బ్యాంకుకు ఎంతవరకు గండి కొడుతుందనేది కీలకం. సంక్షేమ కార్యక్రమాలపై పెడుతున్న భారీ వ్యయం మరియు రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలు అధికార పక్షాన్ని ఆత్మరక్షణలో పడేశాయి. ఈ ఇద్దరు దిగ్గజ నాయకులు తమ పట్టును నిలబెట్టుకుంటారా లేక ఓటమిని మూటగట్టుకుంటారా అనేది ఇప్పుడు మిలియన్ డాలర్ల ప్రశ్న. ఏది ఏమైనా, ఓటర్ల నాడి వేరుగా ఉంటుంది. సంక్షేమ పథకాలపై నమ్మకమా? లేక పరిపాలనలో మార్పు కోరుకుంటున్నారా? అన్నది మే 4న వెల్లడి కానుంది.

# కాకలుతీరిన కమ్యూనిస్టు యోధుడు


నంబూద్రిపాద్ భారతీయ కమ్యూ నిస్టు ఉద్యమ నిర్మాతల్లో ఒకరైన రాజకీయవేత్త, సిద్ధాంతకర్త. దేశ చరిత్ర లో గుర్తింపు పొందిన గొప్ప కమ్యూనిస్టు నాయకులు. భారత దేశంలో కాంగ్రెసేతర సంబంధిత కమ్యునిస్టు పార్టీ పక్షాన ఎన్నికైన తొలి ముఖ్యమంత్రిగా వినుతి కెక్కారు. మార్క్సు వాద సూత్ర బద్ధు డు, విప్లవవాది, రచయిత, చరిత్ర కారుడు. మార్క్సు వాద కమ్యూని స్టు పార్టీ ఆచరణ వాదిగా, క్రియా శీలక నేతగా, 14 యేళ్ళ పాటు జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఆయన తీసుకున్న చొరవ, ముందు చూపు గల నిర్ణయాలవలనే దేశంలో ఈనాడు జాతీయ స్థాయి సంకీర్ణ ప్రభుత్వ రాజకీయాలకు భూమిక అయిందన్న మాట వాస్తవం. నంబూద్రిపాద్ కేరళలో శ్రీకారం చుట్టిన మౌలికమైన భూ సంస్కరణలు, విద్యా సంస్కరణ లను అనుకరించే ప్రయత్నాలు ఈ నాటికి ఇతర భారతీయ రాష్ట్రా లలో జరుగుతూనే ఉన్నాయి. సాంప్రదాయ బ్రాహ్మణ కుటుంబ నేపథ్యం కలిగి ఉన్నా, భూస్వామి కుటుంబంలో పుట్టినా శ్రామిక వర్గ లక్ష్యాలకు అంకితమై శ్రామిక విప్లవ ఉద్యమంలో అగ్ర నాయకుడిగా ఎదిగారు. ఇఎంఎస్ నంబూద్రిపాద్ బహు ముఖ ప్రజ్ఞాశాలి, మార్క్సిస్టు రుషి, నిరంతర క్రియాశీలి. అవిశ్రాంత కలం యోధులు. సాహితీ విమర్శ కులు. సాంస్కృతిక సైనికుడు. పాలనా చతురులు. సిద్ధాంత, ఆచరణల సంగమం. విప్లవ మేధావి. భావితరాలకు చెరగని ఆదర్శం. ఒకనాటి భారత రాష్ట్ర పతి కెఆర్ నారాయణన్ అభివర్ణించి నట్లుగా 20వ శతాబ్దపు మహోన్నత వ్యక్తి. ఇ.ఎం.ఎస్. అనే పేరుతో ప్రసిద్ధి కెక్కిన ఏలాంకుళం మనక్కళ్ శంకరన్ నంబూద్రిపాద్, (1909 జూన్ 13 ? 1998 మార్చి 19) 1909 జూన్ 13 నాడు, ప్రస్తుత మలప్పురం జిల్లా పెరింతాళ్ మన్న తాలూకా ఏలాంకుళం గ్రామంలోని అగ్ర బ్రాహ్మణ కుటుంబంలో జన్మిం చారు. తండ్రి పేరు పరమేశ్వరన్ నంబూద్రిపాద్. విద్యార్థి దశనుంచే శాస్త్రీయ భావాలు అలవరుచు కున్నారు. స్వాతంత్ర్య పోరాటంలో ప్రముఖ పాత్ర వహించారు. చిన్న వయసులోనే ఆయన వి.టి.భట్టాద్రిపాద్ మొదలయిన పెద్దవారికి చేయూతగా, కేరళ నంబూద్రి కుటుంబాలలో పాతుకు పోయిన కులవివక్ష, సాంప్రదాయ వాదం ధోరణులకు వ్యతిరేకంగా పోరాడారు. చదువుకునే రోజుల్లో భారత జాతీయ కాంగ్రెస్ సహ చర్యంతో స్వాతం త్ర్య సంగ్రామంలో తీవ్ర కృషి చేసారు. 1931 లో కాలేజీని వదిలి స్వాతం త్ర్య పోరాటంలో చేరారు. సత్యా గ్రహ ఉద్యమంలో పాల్గొని జైలు శిక్ష అనుభవించారు. అప్పటినుంచి ఆయన దేశ స్వాతంత్ర్యం కోసం సాగిన కాంగ్రెస్ ఉద్యమంలో ముఖ్య పాత్ర పోషించారు. కేరళలో కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ స్థాపకుల్లో ఒకరుగా వున్నారు. 1934 లో ఆయన కాంగ్రెస్ పార్టీ సోషలిస్టు పార్టీ అఖిల భారత ఉమ్మడి కాలంలో కాంగ్రెస్ పార్టీకి, కేరళ ప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా



మార్క్సిజంతో పరిచయం చేశారు. 1936 లో కేరళలో కమ్యూనిస్ట్ పార్టీ వ్యవస్థాపక బృందాన్ని ఏర్పాటు చేసిన ఐదుగురు సభ్యుల్లో ఆయన ఒకరు. నంబూద్రిపాద్ కేరళలో ఒక శక్తివంతమైన కమ్యూనిస్ట్ ఉద్య మం అభివృద్ధికి పునాదులు వేశా రు. సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటం, భూస్వామ్య వ్యతిరేక పోరాటం. రెండు పోరాటాలకు ఆయన ప్రాతినిధ్యం వహించారు. కేరళను ఏకీకృత భాషా రాష్ట్రంగా ఏర్పర్చడానికి దారితీసిన ఐక్య కేరళ ముఖ్య ప్రతిపాదకులలో ఆయన ఒకరు. నంబూద్రిపాద్ మొట్టమొదట 1939 లో మద్రాసు ప్రొవిన్షియల్ శాసనసభకు ఎన్నికయ్యారు. కమ్యునిస్ట్ పార్టీని విస్తృత పరచడానికి ఆయన తన వాటగా వచ్చిన ఆస్తిని పార్టీకి విరాళంగా ఇచ్చాడు. అతను 1939–42 మరియు 1948–50 మధ్య అజ్ఞాతం లోకి వెళ్ళారు. ఆయన 1941 లో భారత కమ్యూనిస్టు పార్టీ సెంట్రల్ కమిటీకి ఎన్నికయ్యారు. డిసెంబరు, 1950 లో సిపిఐ పొలిట్ బ్యూరో సభ్యుడిగా, సెక్రటేరియట్ సభ్యునిగా పనిచేశారు. 1957 లో కేరళ రాష్ట్రం ఏర్పడిన తరువాత జరిగిన మొదటి ఎన్నిక లలో కమ్యూనిస్ట్ పార్టీ మెజారిటీ సాధించడంతో 1957 ఏప్రిల్ 5 నాడు కేరళ రాష్ట్ర ప్రథమ ముఖ్య మంత్రిగా పగ్గాలు చేపట్టి భారత దేశంలో మొట్టమొదటి కమ్యూనిస్ట్ ముఖ్యమంత్రిగా రికార్డులకెక్కారు. త్వరలోనే భూ సంస్కరణల చట్టాన్ని,విద్యా చట్టాన్ని తీసుకు వచ్చారు. వివాదాస్పదమైన పరిస్థి తుల్లో 1959 లో కేంద్ర ప్రభుత్వం, భారత రాజ్యాంగం లోని 356 వ ప్రకరణం అనుసరించి రాష్ట్రపతి పాలన విధిస్తూ ఆ ప్రభుత్వాన్ని కూల్చి వేసింది. కేరళ శాసన సభకు 1960–64, తిరిగి 1970–77 కాలం లో ప్రతిపక్ష నాయకునిగా వ్యవహ రించారు. 1967 లో రెండవసారి ముఖ్యమంత్రి కావడానికి నంబూ ద్రిపాద్ ముస్లిమ్ లీగ్ తో సహా 7 పార్టీల మద్దతు స్వీకరించారు. 1964 లో సిపిఐ (ఎం) ను స్థాపించిన తరువాత ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీ నుండి అందులో చేరారు. 1964 లో జరిగిన అఖిల భారత మహాసభలో పార్టీలో కేంద్ర కమిటీ మరియు పార్టీ పొలిట్ బ్యూరోకు ఎన్నికయ్యారు. ఆయన మరణం వరకు ఈ పదవిలో కొనసాగారు. 1977 లో కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా (మార్క్సిస్టు) ప్రధాన కార్యదర్శిగా పదవిని చేబట్టి 1992 వరకు ఆ బాధ్యతలను నిర్వహిం చారు. అన్ని వామపక్ష, ప్రజాస్వా మ్య, లౌకిక శక్తులను సమీకరిం చడంలో ఆయన నాయకత్వం అమూల్యమైనది. ఒక తెలివైన మార్క్సిస్ట్ సిద్ధాంత కర్తగా, భారతీయ సమాజంలో పరిస్థితులకు అనుగుణంగా మార్క్సిజం – లెనినిజం అన్వయించడంతో పాటు భారతీ య విప్లవం యొక్క వ్యూహానికి అనుగుణంగా సాగించాల్సిన, సాగించిన కృషిని ఆయన రచించారు. ఆయన వ్రాసిన పలు గ్రంథాలలో కేరళ చరిత్ర అనే పుస్తకం బహుళ ప్రాచుర్యం పొందింది. భూమి సంబంధాలు, కేరళ, సమా జం, రాజకీయాలు, మార్క్సిస్టు తత్వశాస్త్రం, సాహిత్యం మరియు చరిత్రలపై ఆయన వ్రాసిన రచనల తో ఆయన్ను దేశంలోనే గాక ప్రపంచంలోనే అత్యంత ప్రభావ వంతమైన కమ్యూనిస్టు ఆలోచనా పరులలో ఒకరిగా గుర్తించ బడ్డాయి. విశిష్ట మార్క్సిస్ట్ సూత్రవేత్తగా, బహుముఖ ప్రజ్ఞాశాలిగా, ఆయన ముందు చూపుకు నిజాయితీ నిబద్ధతలకు కేరళ సాధించిన అభివృద్ధే తార్కాణం. ప్రజల యోజన ద్వారా కేరళలో అధికార, వనరుల వికేంద్రీకరణకు, అక్షరాస్యతా ఉద్యమానికి కృషి చేసారు. ఆంగ్ల, మలయాళ భాషల్లో అనేక పుస్తకాలు రచించిన నంబూద్రిపాద్ పత్రికా విలేఖరిగా కూడా సుపరి చితుడే. ఈ నాటికీ కేరళలో ఆయన పేరు, ఒకప్పటి ఈయన ప్రభుత్వ పనితీరుల గుఱించి దినదినం గొప్పగా చెప్పుకుంటూనే ఉంటారు. నంబూద్రిపాద్ 1998 మార్చి 19 న మరణించారు.

# భద్రాద్రి రామయ్య బ్రహ్మోత్సవాలకు సర్వం సన్నద్ధం

అవిభక్త ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తిరుమల తర్వాత రాష్ట్రంలో ఆరు పెద్ద దేవాలయాలు ఉండేవి... అవి దేవాదాయ శాఖచే 6ఏ టెంపుల్స్ గా గుర్తింపు పొందాయి. శ్రీశైలం, అన్నవరం, ద్వారకా తిరుమల, విజయ వాడ కనక దుర్గమ్మ, భద్రాచలం, వేములవాడ దేవాలయాలను 6ఏ టెంపుల్స్ అని పిలిచే వారు. 6ఏ అంటే ఆరు ఏ గ్రేడ్ టెంపుల్స్ అని అర్థం. రాష్ట్ర విభజన తర్వాత ఈ ఆరు ఏ గ్రేడ్ టెంపుల్స్ లో వేములవాడ, భద్రాచలం తెలంగాణ లోకి రావడం జరిగింది. తెలంగాణ రాష్ట్రం, భద్రాద్రి కొత్త గూడెం జిల్లా, భద్రాచలం మండలం లోని రెవెన్యూ గ్రామం భద్రాచలం. ఇక్కడ భక్త రామదాసు నిర్మించిన శ్రీ సీతారామచంద్ర స్వామి వారి దేవస్థానము కలిగిన గోదావరి నది దక్షిణ తీర పుణ్యక్షేత్రం. దీనిని భద్రాద్రి, శ్రీరామ దివ్యక్షేత్రం అనే పేర్లుతో కూడా పిలుస్తారు. పూర్వపు జిల్లా కేంద్రమైన ఖమ్మం పట్టణానికి 105 కి.మీ.ల దూరంలో ఉంది. పూర్వం భద్రుడు అను భక్తుడు శ్రీ రాముడుకి తపస్సు చేసి, తను ఒక కొండగా మారి తనపై శ్రీ రాముడు వెలసే విధంగా వరం పొందాడని అంటారు. ఆ కొండకు భద్రుడు పేరు మీద భద్రగిరి అని తరువాతి కాలంలో ఆ పట్టణానికి భద్రాచలం (భద్ర + అచలం) అని పేరు స్థిరపడింది. గోల్కొండ నవాబు అబుల్ హసన్ తానీషా పాలనా కాలంలో భద్రాచల ప్రాంతానికి తహశీల్దారుగా కంచెర్ల గోపన్న పని చేసే వాడు. ఇక్కడికి సమీపంలోని నేలకొండపల్లి గ్రామానికి చెందిన గోపన్న శ్రీరామ భక్తుడు. తాను ప్రజల నుండి వసూలు చేసిన పన్ను (6 లక్షల రూపాయలు) సొమ్మును ప్రభుత్వా నికి జమ చెయ్యకుండా,1645 – 1680 మధ్య కాలంలో భద్రగిరిపై శ్రీ రాముడు వెలసిన ప్రదేశ మందు రామాలయాన్ని నిర్మించాడు. సీతా రామచంద్ర స్వాములకు రకరకాల నగలు – చింతాకు పతకం, పచ్చల పతకం మొదలైనవి చేయించాడు. ఆ సొమ్ము విషయమై తానీషా గోపన్నను గోల్కొండ కోటలో బంధించగా, ఆ చెరసాల నుండి తనను విముక్తి చెయ్యమని రాముణ్ణి గోపన్న ప్రార్థించాడు. ఆ సందర్భంలో రామునిపై రచించి, పాడిన పాటలే రామదాసు కీర్తనలుగా ప్రసిద్ధి చెందాయి. గోపన్న కీర్తనలకు తన్మయత్వం చెందిన రాముడు, దేవాలయ నిర్మాణానికి ఉపయోగిం చిన ప్రభుత్వ సొమ్మును తానీషాకు చెల్లించి, గోపన్నకు చెరసాల నుండి విముక్తి ప్రసాదించాడని ఐతిహ్యం. అలా కంచెర్ల గోపన్నకు రామదాసు అనే పేరు వచ్చింది. దేవాలయ మందు సీతా, లక్ష్మణ, హనుమంత సమేతంగా శ్రీరామ చంద్రుడు ఇక్కడ అత్మారాముని రూపంలో కొలువు తీరి ఉన్నాడు. సీత, రాముని తొడపై కూర్చొని ఉన్నట్లు ఇక్కడి విగ్రహాలు చెక్కబడి ఉన్నాయి. మరే దేవస్థానం లోనూ లేని ప్రత్యేకత ఇది. ప్రతి



సంవత్సరం శ్రీరామ నవమికి వైభవంగా జరిగే సీతారామ కళ్యాణ ఉత్సవానికి అశేష ప్రజానీకం వస్తారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ కళ్యాణోత్స వానికి ముత్యపు తలంబ్రాలు, పట్టు వస్త్రాలు పంపించడం సాంప్రదాయం. ఇక్కడ శ్రీరామ పట్టాభిషేకం వైభవంగా జరుగుతుంది. రామ దాసు చేయించిన వివిధరకాల నగలు దేవస్థానపు ప్రదర్శన శాలలో ప్రదర్శనకు ఉంచారు. భద్రాచలం లోని శ్రీరాముడిని వైకుంఠ రాముడు అని అంటారు. ఇక్కడి రాముడు వైకుంఠమునకు వెళ్ళిన తరువాత మరల భూమి మీదకి వచ్చి, తన భక్తుడైన భద్రుడి కోరిక తీర్చి భద్ర పర్వతంపై నిలిచాడు. భద్రాద్రి శ్రీసీతారామచంద్ర స్వామి ఆలయంలో శ్రీరామ నవమి కల్యాణ బ్రహ్మోత్సవాల సందడి మొదలైంది. వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. చాంద్రమాన పరాభవ నామ సంవత్సర చైత్ర శుద్ధ పాడ్యమి గురువారం నుండి చైత్ర శుద్ధ పూర్ణిమ గురువారం వరకు 19-03-2026 నుండి 02-04-2026 వరకు పంచ రాత్ర ఆగమ శాస్త్రోక్త విధానంగా వైష్ణవ సాంప్రదాయ రీతిలో పొడిచేటి సీతా రామానుజాచార్యులు, అమరవాది విజయ రాఘవన్ తదితర ఆచార్యుల ఆధ్వర్యంలో వసంత పక్ష ప్రయుక్త నవాహ్నిక శ్రీరామ నవమీ తిరుకళ్యాణ బ్రహ్మోత్సవములు నిర్వహించనున్నారు. బ్రహ్మోత్సవాల నేపథ్యంలో ఇప్పటికే భద్రాచలం పట్టణాన్ని అందంగా ముస్తాబు చేశారు. ఇప్పటికే అధికారులు శ్రీరామనవమి బ్రహ్మోత్సవాల వేడుకల నిర్వహణపై పలుమార్లు దేవస్థాన ఈవో కె. దామోదర్ రావు ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. వివిధ శాఖల అధికారులు ఏర్పాట్లలో తలమునక లయ్యారు. శ్రీ చాంద్రమాన పరాభవ నామ సంవత్సరాది 'ఉగాది' పండుగ సందర్భంగా ఉదయం ఉగాది ప్రసాద వితరణ ఉ.9-00 నుండి ఉత్సవారంభం – ఋత్విక్ వరణం, రక్షాబంధనం, స్నపన తిరుమంజనం, సా. మృత్సం గ్రహణము, తిరువీధి సేవ (కల్పవృక్ష వాహనం) నూతన పంచాంగ శ్రవణము అంకురార్పణమ్ తో ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. 12-04-2025న ఉ. చక్రతీర్థం, సా.గం.6.00లకు పూర్ణాహుతి, శేషవాహన సేవ, ధ్వజావరోహణము, దేవతోద్వాసనము, ద్వాదశ ప్రదక్షిణలు, ద్వాదశారాధనలు, శ్రీ పుష్పయాగం బ్రహ్మోత్సవముల సమాప్తి జరుగనుంది.

# ఉత్సాహంగా పోలీస్ వర్సెస్ జర్నలిస్ట్ క్రికెట్ మ్యాచ్

**-24 పరుగుల తేడాతో గెలిచిన పోలీస్ జట్టు...**

**-హాఫ్ సెంచరీతో రాణించిన సిఐ ప్రవీన్....**

**-కడదాక పోరాడిన జర్నలిస్టుల జట్టు..**

**అగ్నిధార న్యూస్ ,(పెద్దపల్లి):** ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఐఎంఏ హెల్త్ కప్ ట్రోఫీలో భాగంగా గురువారం పోలీస్ వర్సెస్ జర్నలిస్టుల క్రికెట్ మ్యాచ్ ఆద్యాంతం ఆసక్తిగా కొనసాగింది. రెండు జట్ల మధ్య జరిగిన మ్యాచును ఏసిపి గజ్జి క్రిష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విధి నిర్వహణలో భాగంగా ప్రతీ ఉద్యోగి పని ఒత్తిడికి గురికావలసి వస్తుందని దీంతో కొంత మానసిక ప్రశాంతతకు దూరం అవుతాడని, ఇలాంటి క్రీడల వల్ల ఒత్తిడిని దూరం చేసుకోవడానికి, తిరిగి విధులను మరింత ఆసక్తిగా చేసుకోవడానికి తోడ్పడుతాయని అభిప్రాయపడ్డారు. హెల్త్ కప్ నిర్వహిస్తున్న వైద్యులు రేగళ్ళ రమాకాంత్, ప్రణీత్ తదితరులను ఆయన అభినందించారు.

**ఇరుజట్ల హోరాహోరీ పోరు..**

పోలీస్ వర్సెస్ జర్నలిస్టుల మ్యాచులో గెలుపు కోసం రెండు జట్లు తీవ్రంగా శ్రమించాయి. అయితే బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్ విభాగంలో అద్భుతంగా రాణించిన పోలీస్ జట్టు 25 పరుగుల తేడాతో జర్నలిస్టుల జట్టును ఓడించి విజయాన్ని అందుకుంది.

**సిఐ ప్రవీణ్ హాఫ్ సెంచరీ..**




టాస్ గెలిచిన జర్నలిస్టుల జట్టు ఫీల్డింగ్ ఎంచుకుంది. బ్యాటింగుకి దిగిన పోలీస్ జట్టు ఆదిలోనే వికెట్ కోల్పోయింది. కానీ, ఆ తరువాత మరో వికెట్ పడిపోకుండా జాగ్రత్తగా ఇన్నింగ్సును కొనసాగించింది. అద్భుతమైన ఆటతీరుతో సిఐ ప్రవీణ్ హాఫ్ సెంచరీ చేసి జట్టు స్కోరును 10ఓవర్లలో 85 పరుగులకు చేర్చాడు. 86 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన జర్నలిస్టు జట్టు రెండవ ఓవర్లోనే తొలి వికెట్టును కోల్పోయింది. ఆ తర్వాత వచ్చిన బ్యాటర్లు వెనువెంటనే వెనుదిరగడంతో నాలుగు వికెట్లు కోల్పోయి 61 పరుగులు చేసింది. మరోవైపు ఓపెనరుగా బరిలో దిగిన బెజ్జంకి నరేష్ కడదాక ఒంటరిపోరు



చేసి 38పరుగులు సాధించి జర్నలిస్టు జట్టు తరపున టాప్ స్కోరరుగా నిలిచాడు. మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు సిఐ ప్రవీన్ కు దక్కింది. పోలీస్ క్రికెట్ జట్టు తరపున ట్రాఫిక్ సిఐ అనిల్ కుమార్, ఎస్ఐలు లక్ష్మన్, నరేష్, మల్లేష్, శ్రవన్, శ్రీధర్, నరేష్, కానిస్టేబుల్ వెంకట్ రెడ్డి, అలీం, మనోజ్ క్రికెట్ ఆడారు.

# కార్మికుల జీతాలపై నిర్లక్ష్యం...

## అధికారులపై మార్కపూరి సూర్య ఫైర్

**అగ్ని ధార న్యూస్ ,(రామగుండం),:** రామగుండం నగరపాలక సంస్థలో కార్మికుల జీతాల చెల్లింపులో జరుగుతున్న నిర్లక్ష్యంపై సిపిఐ కార్పొరేటర్ మార్కపురి సూర్య తీవ్రంగా మండిపడ్డారు. "అధికారుల కడుపు నింపుకోడానికి కార్మికుల కడుపు కొడతరా?" అంటూ ఘాటుగా ప్రశ్నించారు.కార్పొరేషన్ పరిధిలో పనిచేస్తున్న సుమారు 125 మంది కార్మికులకు ఇప్పటికీ జీతాలు చెల్లించకపోవడం దారుణమన్నారు. జీతాలు అందక కార్మికులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం కార్మికుల జీతభత్యాల కోసం స్టాంప్ డ్యూటీ నిధులను డిపాజిట్‌గా ఉంచాల్సి ఉన్నప్పటికీ, స్థానిక అధికారులు వాటిని పట్టించుకోలేదని ఆరోపించారు. గత ఏడాది విడుదలైన రూ.16 కోట్ల నిధులను సరైన విధంగా వినియోగించకపోవడంతో కార్పొరేషన్ ఆర్థిక సంక్షోభంలోకి వెళ్లిందన్నారు. అత్యవసర పరిస్థితుల్లో సుమారు 550 మంది కార్మికులకు ఆరు నెలల




జీతాలు చెల్లించే నిధులు నిల్వ ఉండాల్సి ఉండగా, వాటిని అభివృద్ధి పనుల పేరుతో మళ్లించారని విమర్శించారు. ఈ కారణంగా పండగ సమయంలో కూడా కార్మికులు జీతాలు లేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జీతాలు అందక బ్యాంకులు, ఫైనాన్స్ సంస్థల వద్ద తీసుకున్న రుణాల చెక్కులు బౌన్స్ అవుతున్నాయని, వడ్డీ భారం పెరిగి కుటుంబాలు కష్టాల్లో కూరుకుపోతున్నాయని తెలిపారు.స్టాంప్ డ్యూటీ నిధులను డిపాజిట్‌గా ఉంచాలని పలుమార్లు అధికారులకు తెలియజేసినా స్పందించలేదని సూర్య అన్నారు. కొంతమంది అధికారులు, నాయకులు కలిసి టెండర్ల పేరుతో అవినీతికి పాల్పడుతున్నారని ఆరోపించారు. ఈ వ్యవహారంపై విజిలెన్స్ విభాగానికి ఫిర్యాదు చేస్తానని హెచ్చరించారు.పెద్దపల్లి జిల్లా కలెక్టర్, మేయర్ వెంటనే జోక్యం చేసుకుని కార్మికులకు పెండింగ్ జీతాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని, నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# వసతులు అడిగితే దూషిస్తారా?

**బాసర ట్రిపుల్ ఐటీ విద్యార్థినిలపై ఎస్పీ అనుచిత వ్యాఖ్యలు**

**వైరల్ వీడియోతో రాష్ట్రవ్యాప్తంగా ఆగ్రహం**

**క్షమాపణ చెప్పాలని డా. మార్వల్ దుర్గం నగేష్ డిమాండ్**

**అగ్నిధార న్యూస్ ,( రామగుండం):** బాసర ట్రిపుల్ ఐటీలో వసతుల సమస్యలపై నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థినిలపై నిర్మల్ జిల్లా ఎస్పీ జానకి షర్మిల చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదంగా మారాయి. విద్యార్థినులను అవమానించేలా మాట్లాడిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో రాష్ట్రవ్యాప్తంగా ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. విద్యార్థినులు మెరుగైన ఆహారం, వసతి వంటి ప్రాథమిక సదుపాయాలు కల్పించాలని కోరుతున్న తరుణంలో, వారిని "సిగ్గులేని బతుకులు" అంటూ దూషించారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ వ్యాఖ్యలు విద్యార్థినిల గౌరవాన్ని దెబ్బతీసేలా ఉన్నాయని విద్యార్థి సంఘాలు మండిపడుతున్నాయి.ఈ ఘటనపై సమతా సైనిక దళ్ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డా. మార్వల్ దుర్గం నగేష్ తీవ్రంగా స్పందించారు. ఉన్నత హోదాలో ఉన్న అధికారి ఈ విధంగా విద్యార్థినిలను అవమానించడం ఖండనీయం అని పేర్కొన్నారు. "తినడానికి తిండి, ఉండడానికి వసతి లేకపోతే విద్యార్థులు ఎలా చదువుకుంటారు? సమస్యలు చెప్పుకుంటే అవమానించడమేనా?" అని ప్రశ్నించారు.సంబంధిత అధికారిపై తక్షణమే చర్యలు తీసుకుని, బాధిత విద్యార్థినులకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డా. దుర్గం నగేష్ డిమాండ్ చేశారు.ఇదిలా ఉండగా, ఈ ఘటనపై విద్యార్థి సంఘాలు ఆందోళనకు సిద్ధమవుతుండగా, ప్రభుత్వం జోక్యం చేసుకుని సమస్యలను పరిష్కరించాలని పలు వర్గాలు కోరుతున్నాయి.

## సిద్దిపేటలో ఉగాది వేడుకలు

**-- సంక్షేమానికి కాంగ్రెస్ కట్టుబాటు**

**: మంత్రి వివేక్ వెంకటస్వామి**




**అగ్ని ధార న్యూస్ ,(సిద్ధిపేట),:** ఉగాది పర్వదినం సందర్భంగా సిద్దిపేటలో నిర్వహించిన వేడుకల్లో రాష్ట్ర కార్మిక, ఉపాధి మరియు గనుల శాఖ మంత్రి డా. జి. వివేక్ వెంకటస్వామి పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన మంత్రి, రాష్ట్రంలో ఆర్థిక సవాళ్లు ఉన్నప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ కార్యక్రమాలకు పెద్దపీట వేస్తోందని అన్నారు. రైతులు, మహిళల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, సన్న బియ్యం పంపిణీ, రైతుల రుణమాఫీ వంటి పథకాల కోసం భారీగా నిధులు కేటాయించినట్లు వివరించారు. రాష్ట్ర అప్పుల విషయంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం తప్పుడు సమాచారం ఇచ్చిందని, వాస్తవానికి అప్పులు భారీగా పెరిగాయని మంత్రి ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికే కొంతమేర అప్పులు చెల్లించి ఆర్థిక స్థిరత్వం తీసుకురావడానికి చర్యలు తీసుకుంటోందని తెలిపారు. సిద్దిపేట జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం వేగంగా సాగుతోందని, ఇప్పటికే సుమారు 1,500 ఇళ్లు స్లాబ్ దశకు చేరుకున్నాయని చెప్పారు. అలాగే రైతు భరోసా పథకం కింద నిధులు త్వరలో విడుదల చేసి, వారం రోజుల్లోనే ప్రక్రియ పూర్తిచేస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వంపై తప్పుడు ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకత్వాన్ని మంత్రి తీవ్రంగా విమర్శించారు. కాళేశ్వరం, మల్లన్నసాగర్ ప్రాజెక్టులు కమిషన్ల కోసమే చేపట్టినవని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం కాలంలో నిర్మించిన ఎల్లంపల్లి ప్రాజెక్ట్ వల్ల రైతులకు నీటి అందుబాటు కల్పించామని పేర్కొన్నారు.

## కేంద్రీయ విశ్వవిద్యాలయంలో ప్రవేశాలు



**అగ్నిధారన్యూస్ "(సంగారెడ్డి)"** కేంద్రీయ విశ్వవిద్యాలయంలో 1వ తరగతి ప్రవేశాలు ఆన్‌లైన్ విధానంలో 20 మార్చి 2026 నుండి 02 ఏప్రిల్ 2026 వరకు నిర్వహించబడతాయని, ప్రిన్సిపల్ మహేష్ వాసికర్ల గురువారం ఒక పత్రిక ప్రకటనలో తెలిపారు. తల్లిదండ్రులు అధికారిక వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. 2వ తరగతి నుండి 5వ తరగతి వరకు ప్రవేశాల దరఖాస్తు ఆఫ్‌లైన్ విధానంలో (పాఠశాలలోనే) 20 మార్చి 2026 నుండి 02 ఏప్రిల్ 2026 వరకు తీసుకోబడతాయి. 6వ తరగతి నుండి 9వ తరగతి వరకు ప్రవేశాల దరఖాస్తులు ఆఫ్‌లైన్ విధానంలో (పాఠశాలలోనే) 02 ఏప్రిల్ 2026 నుండి 08 ఏప్రిల్ 2026 వరకు ఖాళీల లభ్యత ఆధారంగా తీసుకోబడతాయి. ప్రవేశాలకు సంబంధించిన పూర్తి వివరాలు, అర్హతలు మార్గదర్శకాలు తెలుసుకోవడానికి తల్లిదండ్రులు వెబ్ సైట్ లో సంప్రదించాలని అన్ని తల్లిదండ్రులు నిర్ణీత గడువులోపు దరఖాస్తు పూర్తి చేసి, అవసరమైన పత్రాలను సమర్పించాలని విజ్ఞప్తి చేస్తూ, ప్రవేశాలు కేంద్రీయ విద్యాలయ సంస్థ నియమాలు మార్గదర్శకాల ప్రకారం నిర్వహించబడతాయి ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## అపరమేధావి డా.గుగ్గిళ్ళ దివ్యమూర్తికి సన్మానం



**అగ్నిధారన్యూస్ ఖమ్మం** ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం కొత్తకొత్తూరు గ్రామానికి చెందిన అపరమేధావి డా.గుగ్గిళ్ళ దివ్యమూర్తి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చంద్రుగొండలో యూత్ ఏర్పాటుచేసిన కార్యక్రమానికి మోటివేషనల్ స్పీకర్ గా ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో దివ్యమూర్తి యువతను విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. యువత మంచి అలవాట్లతో మంచి అభ్యుదయ భావాలు కలిగి సమాజంలో ఈ పోటీ ప్రపంచంలో ముందుకు వెళ్లాలని అన్నారు. నేటి యువత రేపటి భావితరాలకు స్ఫూర్తి అని తెలియజేశారు. అక్కడ యువత గుగ్గిళ్ళ దివ్యమూర్తి మా ప్రాంతానికి రావడం గొప్ప విషయమని అన్నారు. తదనంతరం దివ్యమూర్తిని శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా గుగ్గిళ్ళ దివ్యమూర్తి మాట్లాడుతూ ఈ సన్మానం జరగడం తనకు సంతోషంగా ఉందని ఇప్పటివరకు తనకు 126 వేదికల మీద సన్మానం జరిగిందని తెలియజేశారు. ఈ సన్మాన కార్యక్రమంలో చాపలమడుగు వీరబాబు, కుక్కమూడి బాల ప్రసాద్, పాస్టర్ మోజెస్, వార్డుమెంబర్ కృష్ణ,చాపలమడుగు రాములు , కాకటి నతానియేలు, కాకటి తిమోతి, కుక్కమూడి చిట్టిబాబు, చాపలమడుగు రమణ, నారపోగు అశోక్ , చాపలమడుగు నాగరాజు,తదితరులు పాల్గొన్నారు.

## బోనాల వేడుకల్లో దాసరి మనోహర్ రెడ్డి

**అగ్ని ధార న్యూస్,( సుల్తానాబాద్):** పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నియోజకవర్గ ఇంచార్జ్ దాసరి మనోహర్ రెడ్డి సుల్తానాబాద్ మండలంలోని చిన్నకల్వల, సుగ్లంపల్లి గ్రామాల్లో జరిగిన శ్రీ మల్లికార్జున స్వామి బోనాల మహోత్సవంలో పాల్గొన్నారు. ఉగాది సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో



స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నూతన సంవత్సరంలో ప్రజలందరికీ శ్రేయస్సు కలగాలని ఆకాంక్షించారు. కార్యక్రమం అనంతరం గ్రామస్తులు, బీఆర్ఎస్ నాయకులు ఆయనకు శాలువా కప్పి సన్మానించారు

## ఉగాది పంచాంగ శ్రవణం



**అగ్నిధారన్యూస్ (కల్వకుర్తి)** వెల్దండ మండలంలోని బొల్లంపల్లి గ్రామంలో గ్రామ సర్పంచ్ సత్తూరి ప్రసాద్ గౌడ్ ఆధ్వర్యంలో పరాభవనామ సంవత్సరానికి స్వాగతం పలికిన గ్రామ ప్రజలు బొల్లంపల్లి గ్రామపంచాయతీలో ఆంజనేయస్వామి ఆలయంలో ఉగాది పర్వదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామ సర్పంచ్ సత్తూరి ప్రసాద్ గౌడ్ తో కలిసి ప్రజలు, గ్రామ పెద్దలు పంచాంగ శ్రవణం గావించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, గ్రామ ప్రజలు సు:ఖ సంతోషాలతో, పాడి పంటలతో చల్లగా ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం పంచాంగ పఠనం గావించిన పురోహితులు వెంకటేశ్వర శర్మకు సర్పంచ్, మరియు గ్రామ ప్రజలు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ రామకృష్ణ, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఉగాది వేడుకల్లో భాగంగా వాలీబాల్ టోర్నమెంట్

**జిల్లా బిసి విద్యార్థి సంఘం అధ్యక్షుడు దోమ వెంకటేష్ ఆధ్వర్యంలో**



**అగ్నిదార న్యూస్ మహమ్మదాబాద్/గండీడ్:** మహబూబ్నగర్ జిల్లా గండీడ్ మండలం లింగాయపల్లి గ్రామంలో ఉగాది పండుగను పురస్కరించుకొని వాలీబాల్ టోర్నమెంట్ ఘనంగా నిర్వహించారు ఈ టోర్నమెంట్ ను మహబూబ్నగర్ జిల్లా బీసీ విద్యార్థి సంఘం అధ్యక్షుడు దోమ వెంకటేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు టోర్నమెంట్ లో వివిధ జట్లు పాల్గొన్నాయి పోటీపడ్డ టీములలో ప్రదర్శన సృష్టించి మొదటి బహుమతి కైవసం చేసుకున్న శేఖర్ జట్టు గణేష్ జట్టు రెండవ బహుమతి కైవసం చేసుకుంది గెలిచిన విజేతలకు అతిథులు బహుమతులను అందజేశారు అభినందించారు ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు వెంకటయ్య, రాములు, గ్రామ పెద్దలు కురుమయ్య ,జైపాల్ రెడ్డి, టీచర్ వెంకటయ్య, రమేష్, మైపాల్ రంగారెడ్డి లక్ష్మయ్య టీచర్ బ్రహ్మానంద రెడ్డి, నర్సింలు, శ్రీనివాసులు, శ్రీధర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు గ్రామ యువకులు, పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ ఇలాంటి క్రీడా కార్యక్రమాలు నిర్వహించడం వల్ల యువతలో ఐక్యతను పెంపొందించడంతో పాటు ఆరోగ్యకరమైన జీవన విధానానికి దోహద పడతాయని పేర్కొన్నారు

## ఘనంగా ఉగాది వేడుకలు



**అగ్ని ధార న్యూస్,( రామగుండం):** ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని గోదావరిఖనిలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మేరు హనుమంత్ గౌడ్, ఎస్సి మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాశిపేట శివాజీ ఆధ్వర్యంలో రేణుక ఎల్లమ్మ తల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రభవ నామ సంవత్సర ఉగాది పచ్చడి పంపిణీ చేపట్టారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక ప్రార్థనలు చేసి ఆ తల్లి ఆశీస్సులు పొందారు. రాబోయే రోజుల్లో పార్టీ బలోపేతంపై కార్పొరేటర్ అభ్యర్థులు, సీనియర్ నాయకులతో చర్చలు జరిపినట్లు తెలిపారు.రామగుండం నియోజకవర్గంలోని హిందూ బంధువులందరికీ ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మాజీ కార్పొరేటర్ పిడుగు కృష్ణ, మాజీ జిల్లా కార్యదర్శి జక్కుల నరహరి, జిల్లా ఉపాధ్యక్షుడు ముసుకుల భాస్కర్ రెడ్డి, మాజీ మండల అధ్యక్షుడు కోడూరు రమేష్‌తో పాటు కార్పొరేటర్ అభ్యర్థులు, పార్టీ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## డీసీసీ అధికార ప్రతినిధిగా సెగ్గెం రాజేశ్



**అగ్నిధార న్యూస్ ,(పెద్దపల్లి):** పెద్దపల్లి జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధికార ప్రతినిధిగా మంథని ప్రాంతానికి చెందిన సెగ్గెం రాజేశ్‌ను నియమించారు. ఈ మేరకు తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బి. మహేష్‌కుమార్‌గౌడ్ ఉత్తర్వులు జారీ చేశారు. గురువారం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాజ్‌ఠాకూర్ మక్కాన్ సింగ్ ఆధ్వర్యంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ పూర్తి స్థాయి నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. ఈ కమిటీలో జిల్లా అధికార ప్రతినిధిగా సీనియర్ కాంగ్రెస్ నాయకుడు సెగ్గెం రాజేశ్‌కు అవకాశం కల్పించారు. ఆయన గతంలో మంథని మాజీ ఎంపీటీసీగా, ఉమ్మడి కరీంనగర్ జిల్లా యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా, మంథని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా పనిచేశారు. ఇటీవల మంథని మున్సిపల్ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల విజయానికి ఆయన సమర్థంగా బాధ్యతలు నిర్వర్తించిన నేపథ్యంలో అధిష్టానం ఈ పదవిని అప్పగించింది. ఈ సందర్భంగా సెగ్గెం రాజేశ్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందన్నారు. ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ప్రత్యేక దృష్టితో పెద్దపల్లి జిల్లాలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు విస్తృతంగా అమలవుతున్నాయని తెలిపారు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ల శ్రీనుబాబు నాయకత్వంలో పార్టీ మరింత బలోపేతం అవుతోందన్నారు. తనపై నమ్మకంతో ఈ బాధ్యతలు అప్పగించిన మంత్రి శ్రీధర్‌బాబు, శ్రీనుబాబు, డీసీసీ అధ్యక్షుడు రాజ్‌ఠాకూర్ మక్కాన్ సింగ్‌లకు రాజేశ్ కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీలో కష్టపడి పనిచేసే వారిని గుర్తించి ప్రోత్సహిస్తున్నట్లు ఈ నియామకం సూచిస్తుందని ఆయన పేర్కొన్నారు.

# ఊరురా ఉగాది పండగ వేడుకలు..

- ఆలయాల్లో పంచాంగ పఠనం నిర్వహించిన పురోహితులు.
- శ్రీపరాభవ నామ సంవత్సరానికి స్వాగతం పలికిన ప్రజలు.

ఇండ్లలో మామిడి తోరణాలతో అలంకరణ..

తీపి వంటకాలు – ఉగాది పచ్చడి..

గ్రామాల్లో పండగ సందడి దేవాలయాల్లో భక్తుల కిటకిట.

**అగ్నిధార న్యూస్ కమాన్ పూర్** కరువు కాటకాలు లేకుండా వర్షాలు సమృద్ధిగా కురువాలని పాడి పంటలు సుభిక్షంగా ఉండాలని ప్రజలంతా సుఖసంతోసాలతో జీవించాలని కోరుకుంటూ దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహిస్తూ ప్రజలు ఉగాధి పర్వదినం రోజున శ్రీపరాభవనామ సంవత్సరానికి స్వాగతం పలికారు. తీపి వంటలతో పాటు ఉగాది పచ్చడి తయారు చేసుకున్నారు. పలువురు రైతులు వ్యవసాయ పనులు ప్రారంభించారు. మామిడి తోరణాలతో ఇండ్లను అలంకరించుకున్నారు. మండల కేంద్రంలోని స్వయంభూ ఆదివరాహస్వామి క్షేత్రం ఆవరణలోని కళ్యాణ మండపంలో ఆలయ అర్చకులు కలకుంట్ల వరప్రసాదచార్యులు, సముద్రాల వేణుగోపాలచార్యులు పంచాంగ శ్రవణం-నిర్వహించారు. అలాగే మండల కేంద్రంలోని చంద్రమౌళేశ్వర స్వామి ఆలయం, జూలపల్లి మల్లిఖార్జునస్వామి ఆలయంలో పంచాంగ శ్రవణం నిర్వహించారు. ఈ ఆలయాలతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో గల దేవాలయాల్లో భక్తులు ఉగాధి పండగను పురష్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తుల సౌకర్యార్థం దాతలు, స్వచ్ఛంద సంస్థల నిర్వాహాకులు మంచినీటి, మజ్జిగ-కేంద్రాలు ఏర్పాటు చేశారు.



ఆదివరాహస్వామి క్షేత్రానికి పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరావడంతో రహదారిపై ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా కమాన్పూర్ ఎస్ఐ కొట్టె ప్రసాద్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

## ఎయిర్‌హోస్టెస్ శిక్షణకు పెద్దపల్లి బాలికలు



**అగ్ని ధార న్యూస్ ,(పెద్దపల్లి):** పెద్దపల్లి జిల్లాకు చెందిన బాలికలకు ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా ప్రత్యేక చర్యలు చేపట్టారు. జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆధ్వర్యంలో 20 మంది బాలికలను హైదరాబాద్‌లోని గో ఫ్లై ఇంటర్నేషనల్ సంస్థలో ఆరు నెలల ఎయిర్‌హోస్టెస్ శిక్షణ కోసం పంపించారు. ఈ శిక్షణ ద్వారా ఇప్పటికే 12 మంది బాలికలు వివిధ ఉద్యోగాలకు ఎంపికైనట్లు జిల్లా యువజన క్రీడాధికారి సురేష్ తెలిపారు. జిల్లాలోని బాలికలను ప్రోత్సహించాలనే ఉద్దేశ్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. శిక్షణకు సంబంధించిన అన్ని ఖర్చులను ప్రభుత్వం భరిస్తుందని కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా ఉద్యోగాలు పొందిన బాలికలను అభినందించారు. కార్యక్రమంలో గో ఫ్లై ఇంటర్నేషనల్ డైరెక్టర్ విశ్వరూపిణి, వ్యాయామ ఉపాధ్యాయుడు కుమార్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ప్రగతిదాయకం పరాభవ నామ సంవత్సరం మేయర్ మహంకాళి స్వామి





**అగ్ని ధార న్యూస్ ,(రామగుండం):** పరాభవ నామ సంవత్సరం రామగుండం నగర అభివృద్ధికి దోహదపడుతుందని మేయర్ మహంకాళి స్వామి పేర్కొన్నారు. గురువారం రామగుండం నగరపాలక సంస్థ కార్యాలయంలో ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ పంచాంగ శ్రవణంలో చెప్పినట్లు ధర్మబద్ధంగా కష్టపడేవారికి విజయాన్ని, అవినీతి పరులకు అపజయాన్ని ఇచ్చే సంవత్సరం ఇదని తెలిపారు. రామగుండంలో అవినీతి రహిత పాలన అందిస్తూ అభివృద్ధిని సాధించేందుకు కృషి చేస్తామని అన్నారు. గత రెండేళ్లలోనే రామగుండం నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం ద్వారా సుమారు రూ.800 కోట్ల నిధులను ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ మంజూరు చేయించారని తెలిపారు. పాలకవర్గం సమన్వయంతో మరిన్ని అభివృద్ధి పనులను వేగవంతం చేస్తామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పండితుడు ఒజ్జల వెంకటేశ్వర శర్మ పంచాంగ శ్రవణం నిర్వహించారు. రామగుండం నగరానికి అనుకూల కాలం కొనసాగుతోందని, వచ్చే ఎనిమిది నెలల్లో మరింత పురోగతి సాధించే అవకాశముందని తెలిపారు. గోదావరి తీరంలో పుష్కర స్నానాలు ఆచరించడం శ్రేష్టమని సూచించారు. రాశి ఫలాలను కూడా వివరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ పాతపెల్లి ఎల్లయ్య, కార్పొరేటర్లు, వారి కుటుంబ సభ్యులు, సూపరింటెండెంట్ పబ్బాల శ్రీనివాస్, నగరపాలక సంస్థ సిబ్బంది, మెప్మా సిబ్బంది, ఆర్‌పీలు పాల్గొన్నారు. ఉగాది పచ్చడి, భక్ష్యాలు వడ్డించారు.

## ఖనిచౌరస్తాలో బిఆర్ఎస్ వి హెచ్ ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉగాది వేడుకలు



**అగ్నిధారన్యూస్ గోదావరిఖని19** రామగుండం నియోజకవర్గం గోదావరిఖని ప్రధాన చౌరస్తాలో వ్యాల్ల హరీష్ రెడ్డి ఫౌండేషన్,బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం ఉగాది పండుగను పురస్కరించుకొని ఏర్పాటుచేసిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బి.ఆర్.ఎస్ రాష్ట్ర నాయకులు వ్యాల్ల హరీష్ రెడ్డి ఫౌండేషన్ వ్యవస్థాపకులు వ్యాల్ల హరీష్ రెడ్డి దంపతులు హాజరై ఉగాది పచ్చడి, బచ్చాలు పంపిణిచేశారు. ఈ సందర్భంగా హరీష్ రెడ్డి మాట్లాడుతూ.. ముందుగా రామగుండం నియోజకవర్గ ప్రజలకు తెలుగు సంవత్సరాది పరాభవ నామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. గత తొమ్మిది ఏళ్ల క్రితం తెలంగాణ సాంప్రదాయం సంస్కృతి ప్రతిబింబించేలా కేసీఆర్ నాయకత్వంలో ఉగాది వేడుకలు అత్యంత భక్తిశ్రద్ధలతో రైతులు కర్షకులు విభిన్న వర్గాల ప్రజలు సంతోషాలతో జరుపుకున్నారని,ప్రస్తుతం రేవంత్ రెడ్డి సర్కార్ వచ్చాక రైతులకు రైతుబంధు కొట్టాడని పేద ప్రజల సంక్షేమాన్ని గాలికి వదిలేసి తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారన, సింగరేణి కార్మిక అన్నలు కష్టపడి ఉత్పత్తి, ఆదాయం సాధించిన రాష్ట్ర ప్రభుత్వం వేల కోట్ల రూపాయలు వారి ఎమ్మెల్యేలకు అభివృద్ధి పేరిట దోచిపెడుతుందని ఆరోపించారు. రామగుండం ప్రాంతంలో అభివృద్ధి పేరుతో ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రానున్న రోజుల్లో కేసీఆర్ ప్రభుత్వం రానున్నదని తెలంగాణ సంస్కృతి ప్రజల ఆలోచనలకు తగ్గట్టుగా పాలన నిర్వహించి రైతన్నల కళ్ళలో ఆనందం నింపేలా రైతును రాజు చేసేలా ఉంటుందని కార్మికులు ప్రజలు మహిళలు అందరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తారని కెసిఆర్ పాలనకు ఎదురుచూస్తున్న ప్రజలకు ఉగాది పర్వదినం శుభాకాంక్షలు తెలియజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు ఎన్వి రమణారెడ్డి, బొబ్బిలి సతీష్, బక్కి కిషన్, మాజీ కౌన్సిలర్ కృష్ణస్వామి, బిఆర్ఎస్ పార్టీ యువజన విభాగ అధికార ప్రతినిధి బూరుగు వంశీకృష్ణ, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు పోలాడి శ్రీనివాసరావు, అనుముల కళావతి, పర్స స్వాతి, మేకల రామస్వామి, పొన్నం రాజన్న గౌడ్, రంగు దుర్గాప్రసాద్,అల్లి గణేష్, బోట్ల పోషం, మామిడాల రాము, కడమండ్ల శ్రీహరి, ఆడేపు రాజేశం, రొడ్డ సంపత్, రాజ్ కుమార్, సిగిరి రాము, కొండా సురేష్, బొడ్డుపల్లి రాజు, సార్ల ఉదయ్, యువరాజ్ నేత, పోయిల రవి, సంతోష్, క్షత్రియ కమల్, నరేష్, యుగంధర్, ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

## ఆదివరాహస్వామి క్షేత్రంలో మజ్జిగ పంపిణీ



**అగ్నిధార న్యూస్ కమాన్ పూర్** మండల కేంద్రంలోని ఆది వరాహస్వామి క్షేత్రంలో ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని స్వామివారి దర్శనం కోసం వచ్చే భక్తుల కోసం శివసేన సేవా సమితి ఆధ్వర్యంలో మజ్జిగ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ మజ్జిగ కేంద్రాన్ని స్థానిక సర్పంచ్ రంగు సత్యనారాయణ గౌడ్, ఆలయ కార్యనిర్వాహనాధికారి కాంతారెడ్డి, ఆ సంఘం అధ్యక్షులు గన్నవరపు రవి, ఉపాధ్యక్షులు బిల్లా వెంకటేశ్వర్లు, గౌరవ అధ్యక్షులు పిన్ రెడ్డి కిషన్ రెడ్డి, సభ్యులు చిర్రసత్యం, దేవునూరి చంద్రమౌళి, సుద్దాల కృష్ణమూర్తి, మానక ఓదెలు, తుండ్ల శ్రీనివాస్, కూనరాపు సతీష్, గుంపుల సతీష్, ఆవునూరి శంకర్, తాడికొండ రాజశేఖర్, నేలకశీటి కుమార్, బత్తుల శ్రీనివాస్, మల్యాల అశోక్, నాగరాజ్ తదితర శివసేన సేవాసమితి సభ్యులు పాల్గొన్నారు.

## నిరుపేదలకు రంజాన్ కిట్లు పంపిణీ..!



**అగ్నిధార న్యూస్ కమాన్ పూర్** రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని ముస్లిం బీద కుటుంబాలకు రంజాన్ కిట్లను గురువారం మెహరాజ్ ఖాన్ అందజేశారు. కమాన్ పూర్ మండలనికి చెందిన కీర్తి శేషులు మహమ్మద్ ఖాన్ జ్ఞాపకార్థం ( రిటైర్డ్ సీనియర్ లైన్ ఇన్స్పెక్టర్ ) ఎలక్ట్రిసిటీ డిపార్ట్మెంట్ తనయుడు మెహరాజ్ అహ్మద్ ఖాన్ కాంగ్రెస్ పార్టీ మైనార్టీ నాయకులు మరియు కుటుంబ సభ్యులు పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా కమాన్ పూర్ మండలానికి చెందిన రొంపి కుంట ,గుండారం, కమాన్ పూర్ ముస్లిం వంద 100 నిరుపేద కుటుంబాలకు నిత్యవసర సరుకులు పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా నిరుపేద ముస్లిం కుటుంబలు సభ్యులు మరియు షౌకత్ ఖాన్ వరి తండ్రి పేరు మీద ప్రత్యేక ప్రార్థనలు మరియు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమం లో షౌకత్ ఖాన్ మహమ్మద్ యూసుఫ్ లల్లూ సయ్యద్ నజీబ్ అఫ్రోజ్ అహ్మద్ హుస్సేన్ అబ్రోజ్ షోహెబ్ వాజీద్ అస్మాత్ ముజహీద్ సద్దాం బాబులు గౌస్ అజ్జు మైనార్టీ సోదరులు తదితరులు పాల్గొన్నారు.

## ఉగాది పచ్చడి పంపిణీ కార్యక్రమం




**అగ్ని ధార న్యూస్ ,(రామగుండం):** ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని ఎన్‌టీపీసీ యువ హిందూ వాహిని ఆధ్వర్యంలో ఉగాది పచ్చడి పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా 33వ డివిజన్ కార్పొరేటర్ మెరుగు భూలక్ష్మి, 32వ డివిజన్ కార్పొరేటర్ తోట మమత కుమార్, 34వ డివిజన్ కార్పొరేటర్ బొడిగె స్వప్న భరత్ గౌడ్ హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యువ హిందూ వాహిని అధ్యక్షుడు రాజు, ఆయన మిత్రబృందం, కాంగ్రెస్ పార్టీ 33వ డివిజన్ అధ్యక్షుడు లాంబు కిషన్ రెడ్డి, బీసీ సెల్ టౌన్ అధ్యక్షుడు కంది అంజనేయులు, యువ నాయకులు అనురాగ్, అభిషేక్‌తో పాటు ఎన్‌టీపీసీ పట్టణ ప్రజలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉగాది పర్వదినాన్ని సాంప్రదాయబద్ధంగా జరుపుకోవాలని, ఐక్యతతో ముందుకు సాగాలని నాయకులు పిలుపునిచ్చారు.

## అధికారుల నిర్లక్ష్యంతో కార్పొరేషన్ కార్మికులు పండుగ పూట పస్తులు!

**స్టాంప్ డ్యూటీ డబ్బులు డిపాజిట్ చేయక పోవడం వల్ల కార్పోరేషన్ ఆర్థిక సంక్షోభం**

**సిపిఐ కార్పొరేటర్ సూర్య**

**అగ్నిధారన్యూస్ గోదావరిఖని19** గురువారంరోజువరకు ఇంకా 125 మంది కార్మికులకు జీతాలు చెల్లించకపోవడం తీవ్ర నిర్లక్ష్యమని రామగుండం నగరపాలక సంస్థ అధికారులపై సిపిఐ కార్పొరేటర్ మార్కపురి సూర్య ఆగ్రహం వ్యక్తం చేశారు.మీ అధికారుల కడుపు నింపుకోడానికి కార్మికుల కడుపు కొడతరా అని ప్రశ్నించారు రామగుండం కార్పొరేషన్ పరిధిలో పనిచేస్తున్న కార్మికులకు జీతాలు అందకపోవడంతో వారు తీవ్ర ఆర్థికఇబ్బందులుఎదుర్కొంటున్నారని వారు పేర్కొన్నారు.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో కార్మికుల జీతభత్యాల కోసం స్టాంప్ డ్యూటీ రూపంలో నిధులను డిపాజిట్‌గా ఉంచుకోవాలని మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ ద్వారా స్పష్టమైన మార్గదర్శకాలు ఇచ్చినప్పటికీ రామగుండం నగరపాలక సంస్థ అధికారులు వాటిని పట్టించుకోలేదని వారు ఆరోపించారు. గత ఏడాది 16కోట్ల స్టాంప్ డ్యూటీ నిధులు విడుదల చేసినా అధికారుల దురాశ వల్ల ఈ రోజు పండగ పూట కార్మికులు పస్తున ఉండే పరిస్తితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు.అత్యవసర పరిస్థితుల్లో సుమారు 550 పైగా కార్మికులకు జీతాలు చెల్లించేందుకు కనీసం ఆరు నెలల నిధులు నిల్వగా ఉంచాలని సూచనలు ఉన్నప్పటికీ,ఇక్కడి అధికారులు ఆ నిధులను అభివృద్ధి పనుల పేరుతో వినియోగించామని ప్రభుత్వానికి నివేదికలు పంపడం అధికారుల దుర్బుద్ధి కి నిదర్శనంఅని,ఈ పరిస్థితుల కారణంగా రామగుండం కార్పొరేషన్‌లోని కొన్ని విభాగాల్లో పనిచేస్తున్న కార్మికులకు నేటికి జీతాలు పడకపోవడం దుర్మార్గ చర్య అన్నారు. జీతాలు సమయానికిఅందకపోవడంతో కార్మికుల కుటుంబాలు తీవ్రఇబ్బందులుపడుతున్నాయని, బ్యాంకులు మరియు ఇతర ఫైనాన్స్ సంస్థల వద్ద తీసుకున్న రుణాలకు సంబంధించిన చెక్కులు బౌన్స్ అవుతూ కార్మికులు నానా ఇబ్బందులుఎదుర్కొంటున్నారని తెలిపారు. చిన్న చిన్న అవసరాల కోసం తీసుకున్న రుణాలకు వడ్డీపై వడ్డీ పడుతూ కుటుంబాలపై అదనపు భారంగా మారిందన్నారు.ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం పంపిన స్టాంప్ డ్యూటీ నిధులను కార్మికుల కోసం డిపాజిట్‌గా ఉంచాలని తాను పలుమార్లు అధికారులదృష్టికితీసుకెళ్లినప్పటికీ పట్టించుకోలేదని సూర్య తెలిపారు. కొంతమంది అధికారులు, నాయకులు కలిసి టెండర్ల పేరుతో అవినీతి చేస్తూ తమ జేబులు నింపుకుంటున్నారని కూడా ఆరోపించారు. ఈ టెండర్లపై త్వరలో విజిలెన్స్ విభాగానికి ఫిర్యాదుచేస్తానని,రామగుండం కార్పొరేషన్‌లో జరుగుతున్న అవినీతిని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వశీ దృష్టికి తీసుకపోతానని హెచ్చరించారు.ఈ నేపథ్యంలో పెద్దపల్లి జిల్లా కలెక్టర్, మేయర్ ప్రత్యేక శ్రద్ధ చూపించి కార్మికులకు వెంటనే పెండింగ్ జీతాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని, నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ మర్కపురి సూర్య డిమాండ్ చేశారు.

## ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఉగాది పర్వదిన వేడుకలు

**నియోజకవర్గ ప్రజలందరికి ఉగాది శుభాకాంక్షలు...**

**పెద్దపల్లి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చింతకుంట విజయ రమణారావు.**



**అగ్నిధారన్యూస్ పెద్దపల్లి** శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని పెద్దపల్లి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం నిర్వహించిన పంచాంగ శ్రావణ పఠాన మహోత్సవ కార్యక్రమంలో పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణా రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోలీస్ అధికారులకు, కౌన్సిలర్లు సర్పంచులు కాంగ్రెస్ పార్టీ నాయకులు కాంగ్రెస్ కార్యకర్తలు ఉగాది పచ్చడిని సేవించారు. ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్, విజయరమణా రావు మాట్లాడుతూ... పెద్దపల్లి నియోజకవర్గ ప్రజలందరికీ పరాభవ నామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలు తెలియజేస్తూ ఈ నూతన సంవత్సరంలో పెద్దపల్లి పట్టణ ప్రజలందరూ సు:ఖ సంతోషాలతో,ఆయురారోగ్యాలతో ఉండాలని రైతులు పాడిపంటలతో సుభిక్షంగా ఉండాలని అన్నారు... ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నూగిల్ల మల్లయ్య, కౌన్సిలర్లు,ఏసీపీ గజ్జి కృష్ణ, సీఐ ప్రవీణ్ కుమార్, సర్పంచులు,అర్చకులు కొండపాక శ్రీనివాస చార్యులు,శివ కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు,నాయకులు, పాల్గొన్నారు.

## ఇందిరానగర్ కాలనీలో అభివృద్ధి పనులకు శ్రీకారం



**అగ్ని ధార న్యూస్ ,(రామగుండం):** రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయి. 46వ డివిజన్‌లోని ఇందిరానగర్ కాలనీలో కొత్త బోర్డుల ఏర్పాటు పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ ఆశీస్సులతో, మేయర్ మహంకాళి స్వామి ఆదేశాల మేరకు చేపట్టినట్లు కాంగ్రెస్ పార్టీ నాయకులు తెలిపారు. కాలనీ అభివృద్ధికి అవసరమైన పనులను దశలవారీగా చేపడతామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా 46వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఓర్సు అనిల్ మాట్లాడుతూ, ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. స్థానికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే లక్ష్యమని చెప్పారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆశాల ఆక్రోశం..
# వేతన స్థిరీకరణకు నోచుకోని వర్కర్లు

**రెండేళ్లుగా అందని సర్వేల పారితోషకం**
**పెండింగ్‌లో ఎన్నికల రెమ్యునరేషన్**
**పని భారంతో కుంగిపోతున్న కార్యకర్తలు**
**హామీలు మర్చిపోయిన రాష్ట్ర ప్రభుత్వం**



**నిర్మల్ :** ఆశ కార్యకర్తలు అంటేనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చులకనగా చూస్తున్నాయి. ప్రతి 1000 మంది జనాభాకు ఒకరి చొప్పున నియమితులైన వీరికి వేతన స్థిరీకరణ లేకుండాపోయింది. నెలంతా కష్టపడితే రూ.9 వేలు మాత్రమే ఇస్తున్నారు. ఇందులో గర్భిణులను నమోదు చేయకపోతే వేతనాలు నిలిపివేస్తున్నారు. దీంతో ఆశ కార్యకర్తల కుటుంబాలు గడవడం కష్టంగా మారింది. నామమాత్రపు వేతనం ఇస్తున్నా నెల తర్వాత అది కూడా వస్తుందో రాదో తెలియని పరిస్థితితో బతుకులు వెళ్లదీస్తున్నారు. తమ జాబ్ చార్ట్‌తో సంబంధం లేని పనులు చేయిస్తూ, పనికి తగ్గ వేతనం ఇవ్వకుండా శ్రమ దోపిడీకి పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికలకు ముందు తాము అధికారంలోకి వచ్చిన వెంటనే రూ.18 వేల వేతనం చెల్లిస్తామంటూ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ నేటికీ అమలు కాలేదు. అలాగే కరోనా సమయంలో అందించిన సేవలకు సంబంధించి ఆరు నెలల పారితోషికాన్ని ప్రభుత్వం బకాయి ఉంది. దీంతో పెండింగ్‌లో ఉన్న అనేక సమస్యల సాధనకు ఆశ వర్కర్లు పోరుబాట పట్టారు. తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ఈ నెల 16, 17వ తేదీల్లో కలెక్టరేట్‌ల ఎదుట ధర్నా, వంటావార్పు కార్యక్రమానికి పిలుపునిచ్చారు. ఇందులో భాగంగా గత సోమ, మంగళవారాల్లో నిర్మల్‌లోని ఆర్డీవో కార్యాలయం ఎదుట రిలే దీక్షలు, ధర్నా, రాస్తారోకో చేపట్టి తమ నిరసను తెలియజేశారు. ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ సమావేశాల్లో తమ సమస్యలపై చర్చించి ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని డిమాండ్ చేస్తున్నారు. ఆందోళన కార్యక్రమా ల్లో భాగంగా ఈనెల 20న మంత్రుల నివాసాల ఎదుట ధర్నా, 28న చలో హైదరాబాద్ కార్యక్రమానికి రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చింది. నిర్మల్ జిల్లా వ్యాప్తంగా 18 పీహెచ్‌సీలు, 3 అర్బన్ హెల్త్ సెంటర్లు, 3 బస్తీ దవాఖానలతోపాటు పలు ఉప కేంద్రాల పరిధిలో మొత్తం 550 మంది ఆశ వర్కర్లు పని చేస్తున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు ఉన్నతాధికారులు ఏ పని చెబితే ఆ పని చేస్తున్నప్పటికీ తమకు కనీస వేతనం అమలు చేయడం లేదని వాపోతున్నారు.

**సర్వేల పేరిట అదనపు భారం**

వాస్తవానికి ఆశ కార్యకర్తలు గర్భిణులను గుర్తించడం, వారికి నెలనెలా టీకాలు వేయించడం, ప్రభుత్వ ఆసుపత్రులకు తీసుకెళ్లి పరీక్షలు నిర్వహించడం, చిన్న పిల్లలకు ప్రతి బుధ, శనివారాల్లో టీకాలు వేయించడం చేయాలి. ప్రతి డిసెంబర్, జనవరిలలో 15 రోజులపాటు లెప్రసీ సర్వే నిర్వహించాలి. ఇందుకు ఒక్కో ఆశ కార్యకర్తకు రూ.950 చెల్లించాలి. కాని గత రెండేళ్లుగా ఏ ఒక్క కార్యకర్తకు ఈ కాంగ్రెస్ ప్రభుత్వం రూపాయి కూడా ఇవ్వలేదు. రాబోయే రోజుల్లో ఎట్టి పరిస్థితుల్లో లెప్రసీ సర్వే చేయబోమని స్పష్టం చేస్తున్నారు. గతంలో చేసిన అన్ని సర్వేలకు సంబంధించిన పెండింగ్ పారితోషకాలు చెల్లిస్తేనే అధికారులు అప్పగించిన సర్వేలు చేస్తామని చెబుతున్నారు.

**అన్ని పనులకు ఆశ కార్యకర్తలే..**

గ్రామాల్లో ఆశ కార్యకర్తలపై అన్ని శాఖల అధికారులు పెత్తనం చెలాయిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. లెప్రసీ సర్వేనే కాకుండా ప్రతి మంగళవారం నిర్వహిస్తున్న ఆరోగ్య మ హిళ కార్యక్రమానికి మహిళలకు ఆశ కార్యకర్తలే అవగాహన కల్పించి ఆసుపత్రులకు తీసుకొస్తున్నారు. అలాగే పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో జరిగే శుక్రవారం సభకు కూడా వారినే వినియోగించుకుంటున్నారు. ఇటీవల జరిగిన పంచాయతీ ఎన్నికల్లో విధులు నిర్వహించిన ఆశ కార్యకర్తలకు రూ.800 చొప్పున చెల్లిస్తామని చెప్పిన అధికారులు.. ఇప్పటి వరకు ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు. తమతోపాటు విధులు నిర్వహించిన అన్ని శాఖల ఉద్యోగులకు పారితోషికం చెల్లించి తమకు మాత్రమే చెల్లించకపోవడంతో వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తమ గ్రామాల్లోనే కాకుండా ఇతర గ్రామాల్లో డ్యూటీలు వేయడం వల్ల ఆటోల్లో వెళ్లి వ్యయ ప్రయాసాలకోర్చి విధులు నిర్వహించామని, తమకు పారితోషికం చెల్లించలేదని వాపోతున్నారు.

**భారమవుతున్న బతుకులు**

ఆశ కార్యకర్తల బతుకులు భారంగా మారుతున్నాయి. నిత్యావసర సరుకుల ధరలు రోజురోజుకు పెరిగిపోతున్నప్పటికీ కనీస వేతనం కూడా అందకపోవడంతో వారి జీవితాలు గడవడం కష్టంగా మారుతున్నది. ఏదో ఒకరోజు వేతనాలు పెరుగుతాయని, ఉద్యోగులుగా గుర్తింపబడుతామన్న ఆశతో బతుకు భారమైనప్పటికీ విధులు నిర్వహిస్తున్న ఆశ కార్యకర్తలకు కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలతో తీవ్ర నైరాశ్యంలో కొట్టుమిట్టాడుతున్నారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఏ ఒక్క హామీని అమలు చేయలేదని మండిపడుతున్నారు. ఈఎస్ఐ, పీఎఫ్ సదుపాయం కల్పిస్తామని, రూ.18 వేలకు వేతనం స్థిరీకరిస్తామని ఇచ్చిన హామీల్లో ఒక్కటి కూడా నెరవేర్చలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయకుంటే.. రాబోయే రోజుల్లో ఆందోళనలను ఉధృతం చేస్తామని సీఐటీయూ జిల్లా నాయకురాలు సుజాత హెచ్చరించారు.

**కనీస వేతనం చెల్లించాలి..**

ఆశ వర్కర్లకు కనీస వేతనం చెల్లించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తున్నది. రెండు నెలలుగా తమ వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఇస్తామన్న కనీస వేతనం రూ.18వేలు వెంటనే అమలు చేయాలి. అలాగే తమ జాబ్ చార్ట్‌తో సంబంధం లేకుండా అధికారులు పెట్టే టార్గెట్‌లతో ఆశా వర్కర్లు అనేక ఇబ్బందులకు గురవుతున్నరు. ప్రతి నెల ఇంతమంది గర్భిణులను ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకురావాలంటూ టార్గెట్ పెడుతుండడంతో మానసిక వేధనకు గురవుతున్నారు.

# చెత్తపై చిత్తశుద్ధి ఏదీ?

**పట్టణమంతా పారిశుద్ధ్య లోపం**
**చెత్త కుండీలు లేక వీధులు అపరిశుభ్రం**
**ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలు పట్టించుకోని అధికారులు**



**కామారెడ్డి :** పట్టణంలో చెత్త సేకరణపై అధికారులకు చిత్తశుద్ధి లేకుండా పోయింది. బల్దియా పరిధిలోని ప్రధాన కూడళ్లలో చెత్త కుండీలు ఏర్పాటు చేయకపోవడంతో ప్రజలు చెత్తను ఎక్కడ పడితే అక్కడే పారవేస్తున్నారు. దీంతో రోడ్డుపై చెత్త పేరుకుపోతున్నది. పట్టణమంతా దుర్గంధభరితంగా తయారవుతున్నది. మూడు, నాలుగు రోజులపాటు చెత్త ఎక్కడికక్కడే ఉన్నా.. దాని గురించి అధికారులు పట్టించుకో వడం లేదు. ఆయా కాలనీల ప్రజలు ఫిర్యాదు చేసినా.. నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. సానిటరీ ఇన్‌స్పెక్టర్ సెలవులో ఉండడం, ఇన్‌చార్జి లేకపోవడంతో అన్ని పనులూ మున్సిపల్ కమిషనర్ చూసుకోవాల్సి వస్తున్నది. దీంతో పనులు సరిగ్గా కావడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.

**అధికారులు, పాలకవర్గం మధ్య సమన్వయ లోపం..**

తొమ్మిదిన్నరేండ్ల బీఆర్ఎస్ పాలనలో బల్దియా పాలకవర్గానికి, అధికారులకు మధ్య సత్సంబంధాలు కొనసాగేవి. దీంతో ఎక్కడ కూడా పారిశుద్ధ్య లోపం లేకుండా పట్టణాన్ని శుభ్రంగా ఉంచేవారు. కానీ ఏడాది కాలంగా పాలకవర్గం లేకపోవడంతో అధికారులు అలసత్వం వహించారనే ఆరోపణలు ఉన్నాయి. కొత్త పాలకవర్గం ఏర్పడి నెల రోజులు అవుతున్నా.. ఇప్పటికీ మార్పు మాత్రం కనిపించడం లేదు. గత సోమవారం జిల్లాకేంద్రంలో 5కే రన్ నిర్వహించిన సందర్భంగా అధికారులు, పాలకవర్గం మధ్య సమన్వయ లోపంతో సమయానికి ఎవరూ రాలేదు. అదనపు కలెక్టర్ మధుమోహన్ బల్దియా కార్యాలయానికి రాగా.. పట్టణంలో పారిశుద్ధ్య లోపంపై మున్సిపల్ చైర్‌పర్సన్ ఆయనతో మొరపెట్టుకున్నారు. బల్దియా కమిషనర్ రాజేందర్‌రెడ్డి సమస్యలు పట్టించుకోవడం లేదని, ఏది అడిగినా.. తనకు తెలియదని సమాధానం చెబుతున్నారని వాపోయారు. కొందరు కౌన్సిలర్ల ఫోన్లు కూడా లిఫ్ట్ చేయడం లేదన్నారు. కమిషనర్ ఒంటెద్దు పోకడపై నిరసన వ్యక్తంచేస్తూ బీఆర్ఎస్, బీజేపీ కౌన్సిలర్లు సమావేశం నుంచి వాకౌంట్ కూడా చేశారు. ఇప్పటికైనా అధికారులు, పాలకవర్గం అభివృద్ధిపై దృష్టి సారించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు

**చెత్త కుండీలు ఏర్పాటు చేయకపోవడంపై ఆగ్రహం..**

కాలనీల్లో చెత్త కుండీలు ఏర్పాటు చేయకపోవడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. వీధుల్లో మూలమలుపుల వద్ద చెత్త వేయడంతో దుర్గంధం వ్యాపించి, ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. సిబ్బంది తక్కువగా ఉండడంతో చెత్త సేకరణ సాధ్యం కావడం లేదనే విమర్శలు కూడా ఉన్నాయి. కార్మికులు తక్కువగా ఉండడంతో చెత్త పేరుకుపోతున్నది. దోమలు, ఈగలు వృద్ధి చెంది అవి ఇండ్లలోకి వస్తున్నాయి. ఫలితంగా ప్రజలు జ్వరాలు, ఇతర రోగాల బారిన పడుతున్నారు.

**గతంలో 'స్వచ్ఛ తెలంగాణ'..**

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో స్వచ్ఛ తెలంగాణ పేరుతో పట్టణాల్లో 'పట్టణ ప్రగతి' నిర్వహించేవారు. కార్యక్రమంలో భాగంగా ప్రజలకు ఆరోగ్యం, పరిశుభ్రతపై అవగాహన కల్పించేవారు. రోడ్లపై చెత్త వేయకుండా చెత్త కుండీల్లోనే వేయాలని, ఇంటికి వచ్చే ఆటో, ట్రాక్టర్‌కు చెత్త అందజేసి, పట్టణాన్ని పరిశుభ్రంగా ఉండాలని సూచించేవారు. కాంగ్రెస్ ప్రభుత్వ ఏర్పడిన అనంతరం శుభ్రతపై ఎలాంటి చర్యలూ తీసుకోవడం లేదని పట్టణ ప్రజలు విమర్శిస్తున్నారు. పేరుకు మాత్రమే అభివృద్ధి చేస్తున్నామని చెబుతున్నా.. క్షేత్రస్థాయిలో ఎలాంటి చర్యలూ లేవని ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు.

**చెత్త పేరుకుపోతున్నది..**

ఫారెస్టు ఆఫీసు దగ్గర చెత్త కుప్పలా పేరుకపోతున్నది. అధికారులకు పలుమార్లు విన్నవించినప్పటికీ ఎలాంటి స్పందనా లేదు. చెత్త పేరుకుపోయి దోమలు, ఈగలు ఆలడంతో చాలా ఇబ్బంది పడుతున్నాం.

**కార్మికుల నిరసనతో ఇబ్బందులు**

పట్టణంలో సరిపడా కార్మికులు ఉన్నప్పటికీ ఈనెల జీతాలు రాలేదు. దీంతో పారిశుద్ధ్య సిబ్బంది యూనియన్ నాయకులతో కలిసి నిరసన తెలుపుతున్నారు. ఫలితంగా పట్టణంలో చెత్త పేరుకుపోయింది. ఇలాంటి ఘటనలు చోటుచేసుకోకుండా చర్యలు తీసుకుంటా. ప్రజలు చెత్తను చెత్త డబ్బాల్లోనే వేసి పరిశుభ్రతకు సహకరించాలి.

## సీజన్ అయిపాయె.. జీతం రాకపాయే

**మార్కెటింగ్ శాఖ తాత్కాలిక సిబ్బంది అవస్థలు**
**నాలుగు నెలల వేతనాలు పెండింగ్**
**కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు**



**ఆదిలాబాద్ :** వానకాలంలో రైతులు పండించిన పత్తి పంటను మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో యార్డుల్లో కొనుగోలు చేస్తారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో ఏ, బీ మార్కెట్ యార్డులు ఉన్నాయి. పత్తిని కేంద్ర ప్రభుత్వ రంగం సంస్థ కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ)తోపాటు ప్రైవేటు వ్యాపారులు కొనుగోలు చేస్తారు. కొనుగోలు చేసిన పంటకు సంబంధించిన కమిషన్‌ను సీసీఐ, వ్యాపారులు మార్కెటింగ్ శాఖకు చెల్లించాలి. కొనుగోళ్ల సమయంలో తేమ శాతం కొలవడానికి, ఆన్‌లైన్‌లో రైతుల పంట వివరాలు నమోదు చేయడానికి మార్కెటింగ్ శాఖ అధికారులు యేటా తాత్కాలిక సిబ్బందిని నియమిస్తారు. కొనుగోళ్లు జరిగే కాలానికి రోజు వారిగా మార్కెటింగ్ శాఖ అధికారులు వేతనాలు ఇస్తారు. గతేడాది వానకాలంలో రైతులు సాగు చేసిన పత్తి కొనుగోళ్లు అక్టోబరు 24న ప్రారంభమై ఈ ఏడాది ఫిబ్రవరి వరకు కొనసాగాయి. ఆదిలాబాద్ మార్కెట్ యార్డులో తేమ కొలిచే సిబ్బంది తొమ్మిది మంది, ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేయడానికి డాటా ఆపరేటర్లు 10 మందిని మార్కెటింగ్ శాఖ అధికారులు నియమించారు. తేమ కొలిచే వారికి రోజు రూ.569, డాటా ఆపరేటర్లకు రూ.926 చెల్లిస్తారు. సెలవు రోజులు, మార్కెటింగ్ బంద్ ఉన్నప్పుడు వీరికి వేతనం ఉండదు. ఆదిలాబాద్ జిల్లాలో పత్తి కొనుగోళ్లు ఫిబ్రవరి 27తో ముగియగా వీరికి మాత్రం నాలుగు నెలల వేతనాలు రాలేదు. తమకు రావాల్సిన జీతం కోసం తేమ సిబ్బంది, డాటా ఆపరేటర్లు రోజు అధికారుల చుట్టూ తిరుగుతున్నా స్పందించడం లేదు. పనిచేసిన పైసలు రాకపోవడంతో ఉపాధి కోసం చేసిన అప్పులు తీర్చలేక పోతున్నామని వాపోతున్నారు. అధికారులు స్పందించి తమ వేతనాలు వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## మల్లు స్వరాజ్యం జీవితం స్ఫూర్తిదాయకం..!




**కారేపల్లి :** తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధురాలు, ఐద్వా వ్యవ స్థాపకుల్లో ఒకరైన మల్లు స్వరాజ్యం జీవితం ప్రతి ఒక్కరికి స్ఫూర్తిదాయకమని ఐద్వా వైరా డివిజన్ అధ్యక్షురాలు కొండబోయిన ఉమావతి అన్నారు. స్వరాజ్యం 4వ వర్ధంతిని పురస్కరించుకొని బుధవారం కారేపల్లిలో ఆమె చిత్రపటాల వద్ద ఐద్వా నాయకురాళ్లు నివాళులర్పించారు. మల్లు స్వరాజ్యం వర్ధంతి సందర్భంగా ఉమావతి మాట్లాడుతూ మల్లు స్వరాజ్యం పోరాట స్ఫూర్తిని కొనియాడారు. 12 ఏళ్ల వయస్సులోనే వెట్టి చాకిరి, బానిసత్వానికి వ్యతిరేకంగా నాటి దొరలు, జాగీరుదారులపై పోరాటం చేసిన గొప్ప నాయకురాలని ఆమె అన్నారు. తుది శ్వాస విడిచే వరకు ఎర్ర జెండా నీడలో, పేదల పక్షాన నిలిచారని మల్లు స్వరాజ్యం గొప్పతనాన్ని వెల్లడించారు. ఆమె చూపిన పోరాట స్ఫూర్తితో 'మహిళా హక్కుల కోసం పోరాడుదాం' అని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఐద్వా నాయకురాలు చిత్తారు రమాదేవి, ఇదిగాని అనిత, ఏనుగుల పద్మ, కొండబోయిన రమ్య, ఇదిగాని లింగమ్మ, శ్రావ్య, శారద తదితరులు పాల్గొన్నారు.

## యూట్యూబర్ వైష్ణవి హత్య కేసు..
## నిందితులను ఉరితీయాలని కోరుట్లలో ధర్నా



**కోరుట్ల :** కోరుట్ల పట్టణంలోగురువారం తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. యూట్యూబర్ గంధం వైష్ణవి (20) హత్య కేసు నిందితులను ఉరితీయాలని ఆమె కుటుంబీకులు, బంధువులు గురువారం రాస్తారోకో, ధర్నా నిర్వహించారు. వైష్ణవి కుటుంబ సభ్యులుకోరుట్ల పట్టణంలోని కొత్త బస్టాండ్ వద్ద జాతీయ రహదారికి అడ్డుగా కలప దుంగలకు నిప్పంటించి రాకపోకలను స్తంభింపజేశారు. వైష్ణవిని హత్య చేసిన నిందితులకు ఉరే సరైన శిక్ష అని వైష్ణవి ఫ్లెక్సీలను ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. నిందితుల పట్ల పోలీసులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. నిందితుడు హరిబాబు కుటుంబ సభ్యులందరినీ అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. నిందితుడు హరిబాబును తమకు అప్పగించాలని మేమే తగిన శిక్ష విధిస్తామని ఆందోళన చేపట్టారు. సంఘటన స్థలానికి చేరుకున్న సిఐ సురేష్ బాబు, ఎస్ఐ చిరంజీవితో బాధిత కుటుంబ సభ్యులు వాగ్వాదానికి దిగారు. పోలీసులు వారికి సర్ది చెప్పే ప్రయత్నం చేసినా వినిపించుకోకుండా నానా హంగామా సృష్టించారు. హరిబాబు కుటుంబ సభ్యులను అరెస్ట్ చేశామని రిమాండ్‌కు తరలించామని నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. హరిబాబుకు కఠిన శిక్ష పడేలా సాక్షాలు సేకరిస్తున్నామని.. ఆందోళన విరమించాలని కుటుంబ సభ్యులకు సూచించడంతో వారు శాంతించారు. రాస్తారోకో, ధర్నాతో సుమారు గంటపాటు ఎక్కడికక్కడ రాకపోకలు స్తంభించిపోయాయి.




Printed Published Edited and Owned by Chegonda Ravikumar Yadav.Printed at Sri Laxmi Printing Press H.NO.4_6_157 Peddapalli Pin co.505172 State Telangana
TITLE CODE:TELTEL02040 EDITOR: Chegonda Ravikumar Yadav Contact Number.8008817828. Email.agnidharanews@gmail.com http://www.agnidharanews.com